
పడక్కుర్చీ
కబుర్లు-3
నాలుగు క్షేత్రకథానికలు

# పడక్కుర్చీ కబుర్లు

## 3

నాలుగు క్షేత్రకథానికలు

**Padakkurchi Kaburlu - 3**
**Nalugu Kshetrakathanikalu**
**by MBS Prasad**

ప్రచురణ నెంబరు: 03
ప్రథమ ముద్రణ: డిసెంబరు, 2006
ప్రతులు: 1000

ముఖచిత్రం లోగో : **బాపు**
కవర్ డిజైన్ : **జి.రాజేష్**

రచన, ప్రచురణ :

ఎమ్బీయస్ ప్రసాద్
E 101, Satyanarayana Enclave
Madinaguda, Hyderabad 500 049
Ph:040-23047638

ముద్రణ : కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్

సోల్ డిస్ట్రిబ్యూటర్స్:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

**అంకితం**

వరల్డ్‌స్పేస్ 'రేడియో స్పందన' 'ఆర్‌జె' గా నన్ను ఎంపిక చేసి,
ప్రోత్సహించిన దీప గారికి, ఛానెల్ ఇన్‌ఛార్జి వేలు శంకర్ గారికి

# ముందుమాట

నాకు పుస్తకాలు చదవటం యిష్టం, సినిమాలు చూడడం యిష్టం. సభలకు వెళ్లి ఉపన్యాసాలు వినడం యిష్టం. రకరకాల వ్యక్తులను కలిసి పనికి వచ్చేది, పనికి రానిది బోల్డంత సమాచారం సేకరించడం యిష్టం. తెలిసినదాన్ని పదిమందితో పంచుకోవడం యిష్టం.

క్రమంగా నేనొకటి గమనించాను - నేనే అనుకుంటే నా కంటె విషయపరిజ్ఞానం తక్కువున్నవాళ్లు బోల్డుమంది వున్నారని. దానికి కారణం కొంతమందికి ఆసక్తి లేదు, మరికొంతమందికి ఆసక్తి కలిగించేవారు లేరు, యింకా కొంతమందికి ఆసక్తి వున్నా సమాచారం ఎక్కడ దొరుకుతుందో తెలియదు. చెప్పేవారు లేరు. కాగా తెలిసినదాన్ని గుర్తుపెట్టుకునే శ్రద్ధ లేదు మరికొంతమందికి.

నేను పత్రికలకు, వెబ్‌సైట్‌లకు వ్యాసాలు రాస్తూవుంటాను. వరల్డ్‌స్పేస్ శాటిలైట్ రేడియోలో వారం వారం కబుర్లు చెపుతూంటాను. వాటికోసమై సేకరించిన సమాచారాన్ని సులభశైలిలో పాఠకులకు అందించాలనే ప్రయత్నంగా యీ పుస్తక ప్రచురణ మొదలుపెట్టాను. అతి తక్కువ ధరకు అందుబాటులోకి తెస్తున్నాను.

దీనిలో సమాచారానికి ఆధారం - అనేకమంది రచనలు, ఉపన్యాసాలు. వారందరికీ నా కృతజ్ఞతలు. ఆ సమాచారంలో పొరబాట్లు వుండవచ్చు. దాని అవగాహనలో, విశ్లేషణలో నేను పొరబడవచ్చు. దయచేసి అవి నాకు తెలియబరిస్తే సవరించుకుంటాను.

వీటిని మీకు మీరే చదువుకోవడం కంటె ఎవరికైనా - ముఖ్యంగా యువతరానికి - చదివి వినిపిస్తే యింకా సంతోషిస్తాను. నిజానికి నేను ఆ స్టయిల్లోనే రాశాను. కాజువల్ టోన్‌లో, అరమరికలు లేకుండా కబుర్లు చెప్పుకునే ధోరణిలో సాగాయి ఈ రచనలు.

'బుడుగు'లో బొమ్మని దీనికి ముఖచిత్రంగా ఉపయోగించుకోవడానికి శ్రీ బాపు అనుమతించారు. వారికి నా కృతజ్ఞతలు. ఈ సంపుటానికి అందం తెచ్చినవి బాపుగారు, మోహన్‌గారు వేసిన బొమ్మలే! వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

మీరు ఆదరిస్తే యింకా అనేక సీరియస్, నాన్-సీరియస్ విషయాలపై కబుర్లు రాయాలనీ, ఏడాదిలోగా యిలాటివి కనీసం ఓ ఇరవై సంపుటాలు వెలువరించాలని ఆశగా వుంది.

ఇందులో.....

## నాలుగు క్షేత్రకథానికలు




అమరావతి కథలు
పేజీ 07



మిట్టూరోడి కథలు
పేజీ 18







దర్గామిట్ట కథలు
పేజీ 30




## పదక్కుర్బీ కబుర్లు సీరీస్

**పదక్కుర్బీ కబుర్లు - 1 'నలుగురు నటీమణులు'**

భానుమతి, సావిత్రి, జమున, కృష్ణకుమారి

**పదక్కుర్బీ కబుర్లు - 2 'నలుగురు పాత్రధారులు'**

ఎయన్నార్, ఎన్టీయార్, ఎస్వీయార్, గుమ్మడి

**పదక్కుర్బీ కబుర్లు - 3 'నాలుగు క్షేత్రకథానికలు'**

అమరావతి.., మిట్టూరోడి.., దర్గామిట్ట.., మా పసలపూడి..

**పదక్కుర్బీ కబుర్లు - 4 'నలుగురు రాజులు'**

అశోకుడు, కృష్ణదేవరాయలు, శివాజీ, జఫర్

**పదక్కుర్బీ కబుర్లు - 5 'నలుగురు గాయకులు'**

నాగయ్య, ఘంటసాల, పి.బి.శ్రీనివాస్, ఎస్పీ బాలు

**పదక్కుర్బీ కబుర్లు - 6 'నలుగురు నాయకులు'**

నెహ్రూ, పటేల్, బోస్, జిన్నా

**పదక్కుర్బీ కబుర్లు - 7 'నాలుగు విజయా కామెడీలు'**

పెళ్లిచేసి చూడు, మిస్సమ్మ, అప్పుచేసి పప్పుకూడు, గుండమ్మకథ

**పదక్కుర్బీ కబుర్లు - 8 'నాలుగు ముళ్లపూడి నవలలు'**

ఇద్దరమ్మాయిలు.., ఋణానందలహరి, విక్రమార్కుడి.., రాజకీయ..

**పదక్కుర్బీ కబుర్లు - 9 'నలుగురు నిర్మాతలు'**

## అమరావతి కథలు

'క్షేత్ర కథానికలు' అంటే ఏదో ఒక ఊరును ఆలంబనగా చేసుకుని కల్పించిన కథలన్నమాట. దానివల్ల ఆ ఊరి గురించి, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాల గురించి, ఆలోచనా సరళి గురించి, జీవన విధానం గురించి ఒక ఐడియా వస్తుంది. వాటితో బాటు అక్కడి మాండలికమూ పరిచయ మవుతుంది.


ఈ శీర్షిక కింద నాలుగు కథాసంకలనాలను ఎంచుకున్నాను. అమరావతి కథలు, మిట్టూరోడి కథలు, దర్గామిట్ట కథలు,  మా పసలపూడి కథలు. ఒక్కో ఊరు ఒక్కో జిల్లాలో బేస్ అయింది. గుంటూరుజిల్లా, చిత్తూరు జిల్లా, నెల్లూరు జిల్లా, తూర్పుగోదావరి జిల్లా ! వెరైటీ వుంటుంది. ముందుగా అమరావతి కథలు -

2005 జనవరిలో కాలచక్ర ఫంక్షన్ జరిగింది కాబట్టి అమరావతి పేరు ఈమధ్య అందరి నాలుకలమీదా ఆడుతోంది. గుంటూరు జిల్లాలో ఓ వూరు యిది. అక్కడ అమరేశ్వరుడు వెలసి వున్నాడు. క్షేత్రపాలకుడైన వేణుగోపాలస్వామి గుడి వుంది. పైగా బౌద్ధం విలసిల్లిన చోటు కూడాను. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు రాజ్యం చేసిన చోటు.

ఇంత ఇంపార్టెన్సు వుంది కాబట్టే అమరావతిని కేంద్రంగా చేసుకుని శంకరమంచి సత్యంగారు నూరు కథలు రాశారు. అవి ఎంత పాప్యులర్ అయ్యాయంటే శ్యామ్ బెనగల్ వాటిని బేస్ చేసుకుని హిందీలో టీవీ సీరియల్‌గా తీశారు. దేశమంతటా ప్రసారం అయ్యాయి. ఆ కథల్లో రకరకాలైన థీమ్సు వున్నాయి.

ఇవి 100 కథలు. ఆంధ్రజ్యోతి వార పత్రికలో సీరియల్‌గా వచ్చాయి. తర్వాత 1978లో బాపుగారి బొమ్మలతో, ముళ్లపూడి వెంకటరమణగారి పీఠికతో పుస్తకరూపంలో వచ్చాయి. ఈ కథలకు 1979 రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. తర్వాత హిందీలో 'అమరావతీ కీ కహానియా(' పేరుతో శ్యామ్ బెనెగల్ సీరియల్‌గా తీస్తే  దూర్‌దర్శన్‌లో ప్రసారమయ్యాయి.

అమరావతి కథలు రాసినది శంకరమంచి సత్యం గారు.  నాలుగు నవలలు, ఓ నాటకం రాశారు. మూడు శీర్షికలు నడిపారు. ఆయన 1964, 65 ప్రాంతంలో జయపూర్‌లో ఆకాశవాణిలో పని చేసేటప్పుడు 'అమరావతి కథలు' పేర రాద్దామనుకుని కొంత నోట్సు ప్రిపేర్ చేసుకున్నారు. తర్వాత పన్నెండేళ్ల తర్వాత విజయవాడలో ఆంధ్ర జ్యోతి వీక్లీ నడిచేరోజుల్లో ఎడిటర్‌గా వున్న పురాణం



ఉన్నట్టుంది. ఈయన అవాక్కయిపోయాడు పురాణంవారికి దివ్యదృష్టి ఏమీ లేదు కదాని.

తర్వాత తేరుకుని నాలుగు కథలు ఆశువుగా చెప్పారు. పురాణంవారు కాలమ్ మొదలెట్టేసారు. ఈయన పడుతూ, లేస్తూనే వంద కథలు పూర్తి చేశారు. చదివిన జనాలు పిచ్చెక్కిపోయారు. కథల్లో వుండే సింప్లిసిటీ పాఠకుల హృదయాలకు హత్తుకుపోయింది. ఆయన ఆ వూరిలోని ప్రతి రాయీ, రప్పను కథావస్తువులుగా మలచుకున్నాడు. గతకాలపు రాజుల నుండి, మధ్యతరగతి మారాజులు, దొరలు, దొంగలు, ముష్టివాళ్లు, జట్కా బళ్లవాళ్లు, గడ్డి అమ్మేవాళ్లు, తిండిపోతులు, వీళ్లందరూ కథలకు హీరోలే! మనుష్యులేనా – కార్తీకదీపాలు, వాన చినుకులు, దుమ్ములో రేణువులు – వీటి మీద కూడా ఆయన అక్షర శిల్పాలు చెక్కారు.

కథల్లో పూజారులు కనబడతారు, ప్రేమ పూజారులు కనబడతారు, భగ్న ప్రేమికులు కనబడతారు.

ఇలా ఊదరగొట్టేబదులు కొన్ని కథలు మీకు పరిచయం చేస్తాను. వాటిలో గొప్పతనం మీకే అర్థమవుతుంది. అమరావతి కథలు చెప్పేముందు అమరావతి ఎక్కడుందో చెప్పాలిగా, ఎలా వెళ్లాలో చెప్పాలిగా. అదీ సత్యంగారే చెప్పారు 'అదుగో అల్లదుగో' అనే కథలో –

గుంటూరులో బస్సెక్కాలి. ఎక్కారా? తోసుకోటం, గుద్దుకోటం, ముందెక్కుతున్నవాళ్లని వెనక్కి లాగేయటం, వెనకున్నవాళ్లని మోచేతుల్తో కుమ్మేయటం అన్నీ అయ్యాయా –

'ఏందయ్యా, ఆడంగుల్ని ముందెక్కనీ'

'అమ్మో నా కాలు తొక్కేశారు, దేవుడోయ్'

'చెవులవీ చేతులవీ జాగర్తేవ్'

'సామాన్లు కిటికీలోంచి లోపలకి తోసేయ్' ...లాటి కేకలు వినబడ్డాయా?

బస్సు బరువెక్కింది. కిక్కిరిసిన జనాలు, శనక్కాయ మూటలు, ధనియాల బస్తాలు, కూరగాయల బుట్టలు, రేకు పెట్టెలు, పలుపుతాళ్లు, పారలు, ఉక్క బస్తా కుదించి మూతి కుట్టేసినట్టుంది. ఇక లోపలున్న జనాలు ఊరుకుంటారా?

'ఏందమ్మా! అంత సోటుంటే మీది మీదికి పడ్తావూ..?'

'సుట్ట తీసేవోయ్ సోగ్గాడ...అప్పుడే ముట్టించాడు..దొర చుట్ట' అంటూ చిన్న చిన్న తగాదాలు.


కండక్టరు కారా కిళ్లీ నములుతూ వచ్చాడు. 'ఎవరివీ బస్తాలూ..? ఈ బుట్టలీడ్సెయ్!.. ఎడ్లబండనుకున్నారా?..గోరంట్లకి మూడు టిక్కెట్లా? సిటీబస్‌లో పోలేవూ? దిగుదిగు.' ఇలా అంటూ టిక్కెట్లు కోస్తూండగానే డ్రైవర్, క్లీనరూ వచ్చేశారు. క్లీనర్ 'సొంత యిల్లంటయ్యా పరుపుల మీద కూకున్నట్టు కూకోడానికి. పదిమంది కూకునే చీటు. సర్దుగోండి' అంటూ హంగు చేస్తూ

జూనియర్ డ్రైవర్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ 'గురూ! రైటుక్కొయ్ ఎడంకి లాగుతోంది జాగర్త... ఎనక లారీవోడొస్తున్నాడు సైడియ్..ముందు మేకపిల్లుంది సూస్కో. చింతకాయలు కొట్టుకునే ఆ పిల్లనేం జూస్తావ్..ముందు రోడ్డు చూడు బే!' అంటూ పార్థసారథియై బస్సును, కథ నడిపిస్తాడు.




గోరంట్ల, లాం, నిడుముక్కల వచ్చాయి వెళ్లాయి. మోతడక పొలిమేరల్లో డ్రైవరుగారు బస్ ఆపేసి 'ఇంజను హీటెక్కింది. నీళ్లు పొయ్యి' అని అక్కడున్న గుడిసెలోకి వెళ్లిపోయేడు. కాస్సేపు పోయాక

యంట్రాయి వచ్చింది. ఆ తర్వాత నరుకుళ్లపాడు. ఓ మైలు పోతే కృష్ణగాలి వచ్చింది. మరో మైలు రాగానే వైకుంఠపురం కొండ కన్పించింది. మరో అరమైలు ఉందనగా దేవాలయ గోపురం,..అదిగో శిఖరం.. దీపాలదిన్నె.. అమరావతి వచ్చేశాం.




'ఓల్డన్' అన్నాడు క్లీనర్.

ఇప్పుడు ఒక్కో టాపిక్ మీద వున్న కథలు కొన్ని ముచ్చటిస్తాను. 'వరద' అని మొదటి కథ. కృష్ణానదికి వరద వస్తుంది. అందరూ పరుగులు తీస్తారు. అంతా కలిసి ఊరి మధ్యనున్న మాలక్ష్మమ్మ వారి చెట్టు దగ్గరకు చేరారు. అన్ని జాతులవాళ్లూ, అన్ని కులాల వాళ్లూ.

జనాలకు తిండీ తిప్పలూ చూడాలిగా. కుర్రాళ్లు గడ్డపారలు తీసుకుని గాడిపొయ్యి తవ్వేశారు. యింటింటికీ వెళ్లి బియ్యం వసూలు చేశారు. అవధాన్లగారి భార్య, కోమటి సూరమ్మ, తెలగ వెంకమ్మ, గొల్ల సుబ్బమ్మ కత్తిపీటలు ముందేసుకుని చకచక కూరలు తరిగేశారు. వంట పూర్తయ్యాక బారులుగా విస్తళ్లు వేశారు.

శాస్త్రిగారు అవుపోసన పట్టి నెయ్యికోసం చెయ్యి జాస్తే వడ్డించడానికి వచ్చిన నేతి జారీ చెంగున వెనక్కి వెళ్లింది. వడ్డిస్తున్న మాల సంగడు భయంతో పారిపోయేడు. శాస్త్రిగారు వాణ్ని పిలిచి 'ఒరే నీకూ ఆకలేస్తుంది, నాకూ ఆకలేస్తుంది. ఇంకొకళ్లు వేస్తే నెయ్యి, నువ్వు వేస్తే నెయ్యి కాకపోదురా.. వెయ్యరా' అన్నారు. సంగడు ఆనందంగా వడ్డించాడు.


హేపీటైమ్స్‌లో ఈ సుహృద్భావం యిలాగే వుంటుందంటారా? ఆ ముక్క సత్యంగారూ అనరు. కథ చివర్లో – 'వరదొచ్చి మనుషుల మనసులు కడిగేసిందనుకుందామా? అబ్బే! నాకు నమ్మకం లేదు! స్నానం చేసిన వొంటికి తెల్లారేటప్పటికి మళ్లీ మట్టి పట్టినట్టు మనసుల్లో మళ్లీ మలినం పేరుకుంటోంది. ఎన్ని వరదలొచ్చినా మనిషి మనసు కడగలేకపోతోంది. ' అంటూ ముగిస్తారు.

మారుతున్న సామాజిక పరిస్థితులు ఎలాటి మార్పులు తెస్తాయో చూపించిన ఓ కథ – 'అద్గదో బస్సు' – అమరావతికి ఫస్టుటైము బస్సు వస్తోంది. అంతా కోలాహలం. ఇంజను బస్సు, ఇంజను బస్సు అంటూ. 'డ్రైవోరు చక్రం తిప్పితే పట్నం నుంచి ఇక్కడికొచ్చి వాలిపోతది' అని ఒకడంటే 'అంటే గాలిలో ఎగురుకుంటా వస్తదా?' అని ఇంకోడి సందేహం.

'నేలమీదే పరుగెత్తుతాది కాని గాలిలో ఎగిరి నట్టుంటది.'అని క్లారిఫికేషన్.

బస్సు వచ్చినరోజున చాకలాళ్లు రేవు కట్టేశారు. సాలెపేటలో మగ్గాలాగిపోయాయి. పిల్లలు బళ్లు ఎగ్గొట్టేశారు. ఆబాలగోపాలం ఎదురుచూస్తూండగా ఎట్టకేలకు బస్సు వచ్చింది. యుద్ధంనుండి వచ్చిన అర్జునుడిలా ఠీవిగా డ్రైవరు దిగితే అతన్ని అందరూ ఆరాధనాభావంతో చూశారు. ఆడవాళ్లు, పిల్లలు బస్సు తాకి చూస్తూంటే క్లీనరు, కండక్టరు వాళ్లని అదిలించారు.

అయితే ఈ ఆనందోత్సవంలో పాలు పంచుకోనివాడు ఒక్కడే! అతను జట్కా సాయిబు. నేచురల్లీ, బస్సు రావడంతో అతని బేరాలు పోయాయి, అతని భోగం పోయింది. అతను బస్సు పక్కన్నుంచి




గంజి కాయడానికి ఆ పల్లకీ బొంగు విరిచి మంట బెడుతుంది.

ఊరన్నాక కిల్లాడీలు వుంటారు. కనబడే దొంగలు కొందరు, వెనకనుండి వాళ్లను ఆడించే ఘరానాదొంగలు కొందరు. బంగారు దొంగ కథలో ధ్వజస్తంభం రేకుకున్న బంగారుపూతను మెరుగుకాయితంతో రుద్దుతూ ఓ దొంగ పట్టుబడతాడు. ఎవళ్లో చూస్తారు. చావగొడతారు. ఊరిపెద్ద భూషయ్యా వాణ్ని తన పెరట్లో కట్టేయించి అందరినీ పంపేస్తాడు. అందరూ వెళ్లిపోయాక 'తెలివితేటలుండక్కర్లా' అని తిట్టి కట్లు యిప్పేసి చేతిలో ఐదు రూపాయలు పెట్టి పంపేస్తాడు. అంటే వాడు వట్టి కిరాయిదొంగ. అసలు దొంగ ఊరిపెద్దే!

అలాగే ఎండాకాలం వచ్చేసరికి కృష్ణ ఎండిపోయి సుడిగుండం బయటపడుతుంది. అక్కడ వడ్డెవాడు ఒకడు బాచి అని పేరు ఓ జల్లెడ తీసుకుని రతనాలు దొరుకుతాయేమోనని జల్లిస్తూంటాడు. అది చూసిన ఓ మోతుబరి 'మా యింట్లోవాళ్ల ముక్కుపుడక అందులో పడిపోయింది. నువ్వు తీసుకుని పోయుంటావు. ఇచ్చేస్తావా లేక..' అని బెదిరిస్తాడు. భయపడిపోయిన బాచిగాడు తెల్లార్లూ వెతికి ఆ ముక్కుపుడక సంపాదిస్తాడు. పట్టుకెళ్లి మోతుబరికి యిచ్చి వస్తాడు. మళ్లీ వేట ప్రారంభం!

రంగడు అని ఇంకోడు వుంటాడు. అమరయ్యగారి పొలంలో గొర్రె పెంట వేస్తూంటే ఊళ్లోకి దోపిడీ దొంగలు వస్తారు. వాళ్లు అమరయ్య పురమాయించినవాళ్లే. అది తెలియక ఈ రంగడు అమరయ్యకే చెప్తాడు - యిలా దొంగలొచ్చారండీ అని. 'దొంగలొస్తే నీకెందుకురా? పోయి పనిచూసుకో' అంటూ అతన్ని తరిమేస్తాడు. మర్నాడు చూస్తే ఆ దొంగలు ఊళ్లో కొన్ని యిళ్లలో దోస్తారు.

అమరయ్య ఆ దొంగలకూ, రంగడికీ లింకు కడతాడు. పెద్దలచేత శిక్ష వేయించి రంగడి గొర్రెల్లో సగం లాక్కుంటారు. దొంగలు మళ్లీ వస్తారు. రంగడు వాళ్ల వద్దనే మొత్తుకుంటాడు. వాళ్లు వెళ్లి అమరయ్య పాడి ఆవు, దూడ పట్టుకొచ్చి రంగడికి యిచ్చేస్తారు. రంగడికి ఏం చేయాలో తెలియలేదు. ఎవరాదుకుంటున్నారో, ఎవరన్యాయం చేస్తున్నారో తెలియక తబ్బిబ్బయ్యాడు. ఆ ఆవూ, దూడ, మిగిలిన గొర్రెలు తోలుకుని ఆరూళ్ల అవతలికి పారిపోయాడు.

'ఇద్దరు మిత్రులు' అని ఇంకో కథ. రాహుకేతువుల్లాటి వాళ్లు. ఊళ్లో కనబడ్డ మట్టిని తీస్తున్నవాళ్లను దబాయించి ఆ భూమి నాదేనంటాడు ఒకడు. శ్మశానాన్ని తాకట్టుపెట్టి డబ్బు గడించేవాడొకడు. ఇద్దరూ ఓ సారి అనుకోకుండా ఎలక్షనులో పోటాపోటీగా నిలబడబోయి, తప్పుకుని ఇతరులను రంగంలోకి దింపుతారు. ఆ ఇద్దరూ కాంప్రమైజ్ అయ్యి ఎన్నిక మానేస్తారు కానీ ఈ లోపునే వీళ్ల జేబులు నిండుతాయి.

ఇంకోడుంటాడు, చలమయ్య అని. తలలు మార్చే రకం. ఒకతను వచ్చి 'ఆ గోడపక్క స్థలం ఎవరిది?' అని అడుగుతాడు. 'నిలబడగలవా?' అని అంటాడితను. 'నిలబడమంటే నిలబడతాను' అంటాడు అవతలివాడు. అయితే యింటికెళ్లి వంద పట్రా అంటాడు. గుంటూరెళ్లిపోయి, ప్రస్తుతం పోరంబోకుగా వున్న ఆ స్థలం మూడు తరాల క్రితం ఇతని వంశానికి చెందినట్టు కాగితం సృష్టించి,

చూసుకుని ఉన్న మూడెకరాలకూ వారసులు దావా వేశారు. తను నిలబడలేదు. మాటకూడా పోయింది. అందర్నీ నిలబెట్టిన తను ఆ దశలో నిలబడలేకపోతినే అని వాపోయాడు. అదీ కథ!




'తంపులమారి సోమలింగం' అని మరో కథ! ఎలాగోలాగ గొడవలు పెట్టడం, కోర్టుకు ఈడ్పించడం, వాళ్లు తన్నుకుంటూంటే చూసి ఆనందించడం అదీ అతని హాబీ. ఎవరైనా ఇల్లాలు మెడనిండా నగలతో కనిపిస్తే సోమలింగానికి కంపరమెత్తేది. ఎవడైనా నవ్వుతూ కనిపిస్తే వెన్నులో పోటొచ్చేది. అతని చూపుకి ఊరంతా భయపడేది. అందరూ అతన్ని తప్పించుకు తిరిగేవారు.

ఇలా వుండగా అతనికి అవసానదశ సమీపించింది. పూరందర్నీ పిలిపించాడు. 'నేను పాపాత్ముణ్ని. నన్ను దహనం చేయకండి. నాకంత అర్హత లేదు. క్షమించండి. నన్ను గోరీల దొడ్డిలో పాతిపెట్టండి, చాలు' అని బతిమాలాడు. వీళ్లు పోన్లే అలాగే చేద్దామనుకున్నారు. అతని శవాన్ని గోరీల దొడ్డికి మోసుకెళ్లారు. సాయిబులు వచ్చి హిందువుని అక్కడ పాతిపెడ్తే కుదరదన్నారు. ఎక్కువ తక్కువల ప్రశ్న వచ్చింది. కర్రలు లేచాయి. దొమ్మీ జరిగింది. అప్పుడో ముసలమ్మ వచ్చింది. 'వాడు చచ్చిం తర్వాత కూడా పోట్లాట పెట్టడానికి వేసిన ఎత్తురా యిది' అని బుద్ధి చెప్పింది. అప్పుడు హిందువులూ ముస్లింలూ కలిసి మోసుకెళ్లి కృష్ణ ఒడ్డున ఆ శవాన్ని బూడిద చేశారు.

ఇప్పుడు సైకలాజికల్ కథలు ఓ రెండు మచ్చుకు చెబుతాను.

'ఆరేసిన చీర' అనే కథలో కొత్తగా పెళ్లయిన చాకలి జంట లచ్చి, సాంబడు గురించి చెబుతారు. వాళ్ల కెప్పుడూ పడదు. పెద్దలు పట్టుబట్టి పెళ్లి జరిపారు కానీ వీళ్లకు యిష్టం లేదు. సాంబడికి బొద్దుగా వున్న ఆడపిల్లలంటే యిష్టం. లచ్చి సన్నగా వుంటుంది. లచ్చికి నాజూగ్గా వున్న మగాళ్లంటే యిష్టం. సాంబడు మోటుగా వుంటాడు.

ఇద్దరూ పోట్లాడుకుని మౌనంగా బట్టలుతుకుతున్నారు. సాంబడు చేతికి సీతాలు నెమలికంఠం రంగు చీర వచ్చింది. సీతాలు నవ్వు, మాట, నడక.. గుర్తొచ్చి సాంబడికి హుషారొచ్చింది. దబదబా ఉతుకుతున్నాడు ఆ చీరను. అలాగే లచ్చి అత్తకోడలంచు పంచె సంబరంగా ఉతుకుతోంది. అది కోటేశు పంచె. కోటేశంటే లచ్చికి ఆరాధన. 'మొగాడంటే ఆడు' అనుకుంది.

మధ్యాహ్నానికి బట్టలన్నీ ఉతికి, మాట్లాడకుండా ఎదురెదురుగా అన్నం తిని, బట్టలు ఆరేశారు. సీతాలు చీర ఆరేసేటప్పుడు సాంబడి వొంట్లో నెత్తురు జిల్‌మని పొంగింది. కోటేశు పంచె ఎగిరిపోకుండా రాళ్లు పెడ్తుంటే లచ్చికి పాలిండ్లు పొంగాయి.

సాయంత్రం యింటికి వచ్చే వేళకి యిద్దరూ బట్టల్లోంచి తమ కిష్టమైన బట్టలు తీసి కట్టుకున్నారు. ఆశ్చర్యం! సీతాలు నెమలికంఠం చీరలో లచ్చి అందంగా కనిపించింది సాంబడికి. కోటేశు అత్తకోడలంచు పంచెలో సాంబడివైపు ఆశగా చూసింది లచ్చి. 'మూటెత్తు' అంది. సాంబడు మూటెత్తి ముందుకొచ్చి లచ్చిని ముద్దు పెట్టుకున్నాడు. లచ్చి తోసెయ్యలేదు. పెదవులందించి తృప్తిగా నవ్వింది.

అలాగే ఇంకో సైకలాజికల్ కథ 'ఎంగిలా?' అని. రామశాస్త్రి అని వేదపండితుడు. కుర్రవాడే




మంచి పొంకంగా వున్న ఓ ఉప్పరిపిల్ల ఓ చిన్న గుడ్డ మొలకు చుట్టుకుని హాయిగా, స్వేచ్ఛగా స్నానం చేసి విశ్రమించడం కనబడింది. నవ్వుకుంటోంది, నదిలోకి దూకి ఈతలు కొడుతోంది. రామశాస్త్రి మనసులో కలుక్కుమంది. ఫెళ్లుమనే ఆమె వయసు, కృష్ణ సుళ్లులా ఆమె వొంటి సొంపులు యితని పూజ సాగనిచ్చాయి కాదు.

కకావికలైన మనసుతో ఇంటికి వచ్చేశాడు. భార్య అన్నం వడ్డిస్తూంటే ఆమెను తదేకంగా చూశాడు. 'నల్లపిల్లే కాదు శ్రీదేవి కూడా అందంగానే వుంటుంది' అనిపించి అన్నం కలిపి ఓ ముద్ద భార్య నోటికి అందించాడు.

ఆమె అబ్బురపడి 'ఎంగిలి కాదో!?' అంది.

'ప్రసాదమనుకోరాదో!' అన్నాడు రామశాస్త్రి.

'అయితే అనుగ్రహించండి' అంటూ ఆమె నోరందించడానికి బదులు దోసెడు పట్టింది.

ఎలా? ఈవిడ్ని మార్చడం?

అవాళ రామశాస్త్రి గుడినుండి వస్తూ అప్పయ దీక్షితులవారిని అడిగాడు – 'తాతా! సంసారం విషవృక్షం కాదా?' అని

'విషవృక్షమే కానీ అమృతఫలాలు కాస్తాయి' అని జవాబిచ్చాడు పెద్దాయన.

'తెలిసి తెలిసి చేదు తింటామా?' అని మళ్లీ యితని సందేహం.

'చేదు తెలిసిన నోటికే తీపి రుచి బాగా తెలుస్తుందిరా' ఆయన సందేహనివృత్తి.

ఆ రాత్రి భార్య కాళ్లొత్తి వెళ్లిపోతూంటే అన్నాడు – 'పార్వతీదేవి భర్త సేవ చేసి వేరే వెళ్లిపోయేదా?' అని.

'ఆ సంగతి కామాక్షీదేవి నడగాలి' అంది భార్య.

'అడగనక్కరలేదు. నాకు ఈశ్వరుడు చెప్పాడులే' అంటూ భార్యని దగ్గరకు తీసుకున్నాడు.


అంతే, ముగింపులో ఒక్క వాక్యం – 'ఆ నాటినుండీ శ్రీదేవమ్మకు వేరే చాపతో పనిలేకపోయింది. మరి రెండు సంవత్సరాల్లో ఆ యింట అమరేశ్వరుడు, బాలచాముండేశ్వరీ పుట్టారు'.

సామాన్యులుగా కనబడే అసామాన్య భక్తుల గురించి కొన్ని కథలు రాశారు సత్యంగారు. గుడ్డి గంగన్న అనే అతనికి గుడి పక్కగా స్థలం వుంటుంది. తంబూరా మీటుకుంటూ తత్వాలు పాడుతూ దేవుడి ప్రసాదం తింటూ తిరుగుతూంటాడు. గుడి ఆదాయం పెంచడానికి చుట్టూ షాపింగు కాంప్లెక్సు కడదామని, అధికారులు ప్లాను వేస్తారు. గంగన్న స్థలం కూడా కలుపుకుంటే తప్ప అది సాధ్యపడదు.

కానీ ఇతను స్థలం అమ్మనంటాడు. 'పండగొచ్చినా, పబ్బమొచ్చినా బిచ్చగాళ్లందరూ అక్కడే వండుకు తింటున్నారు. మీకు స్థలం అమ్మితే మీరు వాళ్లను గెంటేస్తారు.' అంటాడు. దాంతో అధికారికి కోపం వచ్చి 'దేవుడి ప్రసాదం తప్ప తక్కినది తిననని నీ నియమం కదూ. ఇదిగో, రేపణ్నుంచి యితనికి ప్రసాదం పెట్టకండి' అని హుకుం జారీ చేస్తాడు.

అంతే, నాలుగు రోజులపాటు అతనికి పెట్టరు. ఇతను మరేదీ తినకుండా చచ్చిపోయే దశకు

ముష్టాళ్ల మధ్య కూచుని అడుక్కోబోతుంది. ఎవరూ దగ్గరకు రానివ్వరు. చివరకు ఓ మూల కూచుని అలాగే ఒరిగిపోతుంది. స్నానం చేయని ముసలమ్మ, దేవుణ్ని చూడని ముసలమ్మ 'సాంబశివా' అనని ముసలమ్మ ముక్కోటినాడు చచ్చిపోతుంది.




ఇలాటి సెంటిమెంటల్ కథ చాలా మంది రాస్తారు. కానీ ఇక్కడ సత్యంగారి స్ట్రోక్ కనబడుతుంది. 'ముసల్దానికి తమ పక్కన చోటు యివ్వని ముష్టాళ్లందరూ మర్నాడు ఆమె శవాన్ని చూపించి ఐకమత్యంగా మళ్లీ అడుక్కున్నారు' అని ఫినిషింగ్ టచ్ యిస్తారు!

'రాగిచెంబులో చేపపిల్ల' అనే కథలో ఓ చాదస్తురాలు వుంటుంది. అన్నం కాలికి తగిలితే అంటు, ఏ ఉప్పర సరవయ్యో ఎదురుపడితే బిందెడు నీళ్లు ఒంపేసేది. అలాటావిడ ఓ రోజు బిందెలో నీళ్లు రాగిచెంబుతో ముంచుకు తాగాక చూస్తే అడుగున ఓ చేపపిల్ల కనబడింది. ఇంకేముంది? కొంపమునిగింది అనుకుని మొగుణ్ని లేపి 'ఆ చేపపిల్ల వున్న నీళ్లతోనే అన్నం వండాను. వాటితోనే దేవుడికి నైవేద్యం పెట్టాను. అవే తాగాను. నా మడి మండిపోయింది..' అని కుళ్లి కుళ్లి ఏడ్చింది.

మొగుడు చివాట్లేస్తాడు – 'కృష్ణలో చేపలు లేవా? తినే అన్నం కాలికి తగిలితే మైలా?' అని. అప్పుడు ఆమెకు జ్ఞానోదయం అవుతుంది. 'ఎవర్నీ అంటకుండా మడిగా ముత్యపు చిప్పలో ముత్యంలా బతకాలనుకున్నా. నీళ్లలో చేపలా బతకాలని తెలిసింది కాదు.' అనుకుంటుంది. అక్కడ సత్యం గారు ఓ మాట రాస్తారు – 'అందుకే కాబోలు రామయ్యగారి కర్రి ఆవు తనను చూస్తే పొడవటానికి వస్తుంది' అని అనుకుంటుందామె. ఆ యాసిడ్ టెస్ట్‌తోనే ఆ అజ్ఞానురాలు తన పొరబాటు గుర్తించింది. కథ ఆ ఆవుతోనే ప్రారంభమవుతుంది.

కథలన్నీ సెంటిమెంటల్‌గా, ప్రబోధాత్మకంగా వుంటాయనుకోకండి. చక్కటి హాస్య కథలూ వున్నాయి. వాటిల్లో వ్యంగ్యమూ వుంది. గుడిని ఆశ్రయించుకుని వున్నవాళ్లకు క్రమంగా అలసత్వం వస్తుంది. పూజారులైనా అంతే, కళాకారులైనా అంతే! వంశపారపర్యంగా జాబ్ వచ్చేసి జాబ్ సెక్యూరిటీ పెరిగిపోవడంతో ఇదే ప్రాబ్లెమ్! దాన్నే చెబుతారు 'ఎవరు పాడినా ఆ ఏడక్షరాలే!' అనే కథలో.

ఆరోజు నందివాహనం ఊరేగింపు.

అర్చకులు 'వాయించడోయ్! భజంత్రీలు' అన్నారు. కానీ వచ్చిన సన్నాయి వాద్యగాళ్లు వాయిస్తేగా, వాదించుకుంటూ కూచున్నారు. 'ఏంటోయ్, నువ్వాయించేది'


'నువ్వేందోయ్, వాయించేది'

'నీకు సన్నాయి కర్రకి బొక్కలెన్నో తెలుసా?'

'నీకు పీక నోట్లో పెట్టుకోవటం తెలుసంట్రా?'

ఇద్దరూ వాద్యగాళ్లూ తొడలు కొట్టుకున్నారు. సన్నాయి కర్రల్తో మోదుకున్నారు. అర్చకులు తిట్టారు 'మీరు పడిచావ! ఊరేగింపు బయలుదేరాలి. వాయించండ్రా' అన్నారు.

'ఉండండి. వాడు వాయించేది నేను వాయించలేనట. ఎవడు వాయించినా ఆ ఏడచ్చరాలే




వాయించడం! పానకాలు 'తనక తనకం తత్తనక తనకం' అని వీరంగం వాయిస్తే పరమేశు నైవేద్యాలు జరిగే టప్పుడు వాయించే వరస వాయించాడు. ఉన్న ఒకే ఒక డోలు వాద్యగాడు ఎవరికి వాయించాలో తెలియక కుడి పానకాలకి, ఎడమ పరమేశుకి బాదటం మొదలెట్టాడు. తాళం వాడు వాడిష్టం వచ్చినట్టు ఇంకెవడికో తాళం వేస్తున్నాడు. మీ వాద్యాల సంగతి నాకనవసరం అని శంభులింగం బయ్‌మని శంఖం పూరించాడు. ఈ ధ్వనులన్నింటినీ ముంచేట్టుగా దూదేకుల సాయిబు 'ఖయ్ ఖయ్'మని బాకా వూదాడు. ఇలా పరమబీభత్సమైన వాద్యఘోష విని పెద్దదొరగారు 'ముత్యాలమ్మ జాతర జరుగుతోందా?' అని అడిగారు.

అప్పుడు గుమాస్తాగారు చెప్పారు - 'అయ్యా తమ పూర్వీకులు అందరికీ మాన్యాలిచ్చారు. సన్నాయివాళ్లకి పన్నెండు ఎకరాలు, డోలుకి పన్నెండు, తాళానికి పన్నెండు..యిలా.. వచ్చిన భూముల్ని అనుభవిస్తూ కూచున్నారు కానీ సంగీతం నేర్చుకోలేదయ్యా' అని.

దొరగారు సంగతి గ్రహించి వాద్యగాళ్ల కుటుంబం నుంచి వీరాస్వామి అనేవాణ్ని ఎన్నికచేసి పదివేలు ఖర్చుపెట్టి ఐదేళ్లపాటు తంజావూరు పంపించి సంగీతం నేర్చుకోమన్నారు. వాడు తిరిగొచ్చాక కచేరీ ఏర్పాటు చేస్తారు. పక్కవాడు ఆలాపన చేస్తూంటే ఇతను సన్నాయి పీక నోట్లో పెట్టుకుని 'పీపీ' అనడమే తప్ప మరేమీ అనడు. అవతలివాడు కీర్తన అందుకున్నా మనవాడు 'పిప్పీ పీ' యే.

ఈ కథలో ఎన్ని రకాల సందేశాలున్నాయో చెప్పలేను. కళాకారుడిని మరీ పేంపర్ చేయకూడదని, కళాకారుల కుటుంబంలో పుట్టినంత మాత్రాన ప్రతిభ రాదనీ, కళ గానీ మరో ప్రతిభగానీ వారసత్వంగా రాదనీ - యిలా ఎన్నయినా వున్నాయి.

అలాగే 'త,ధి,తో,న' అనే కథ వుంది. గిరీశం అనే అతనికి మద్దెల నేర్చుకోవాలని మహా వ్యామోహం. ఎన్ని అగచాట్లు పడినా ఆ విద్య అతనికి అబ్బదు. ఆ అగచాట్లు చదువుతూంటే ఓ పక్క నవ్వు, ఓ పక్క జాలి. చివరికి ఓ ముసలాయన అడుగుతాడు "ఒరే ఇంతమంది గురువుల్ని ఆశ్రయించినా నీకు విద్య అబ్బలేదేరా?" అని. "గురువులు మర్మం విడిచి విద్య చెప్పటం లేదు తాతయ్యా లేకపోతే ఈపాటికి మహా విద్వాంసుణ్ని కాకపోయానా" అంటాడు గిరీశం.

ఓ థర్డ్‌రేట్ హరిదాసుగారి కథ 'ఏక కథా పితామహ'. ఏదైనా ఊరెళ్లి భారతం లాటిది చెప్పుకుంటే ఏ నెల్లాళ్లపాటు భుక్తి గడిచిపోతుంది కదాని అతని ఆశ. వాద్యగాళ్లను ఒప్పించి అమరావతికి వచ్చాడు. రాత్రికి కథ చెప్దామని ఏర్పాట్లు మొదలెట్టగానే ఊళ్లోవాళ్లు వచ్చారు. 'నువ్వు ఇదివరకు వచ్చావుగా వెళ్లిపోమని చెప్పాం. అయినా వచ్చావు. వెంటనే పొలిమేర దాటిపో' అన్నారు.

ఇతను భయపడి వెళ్లిపోదామనుకున్నాడు కానీ మద్దెలతనికి కడుపునొప్పి రావడంతో రాత్రి చెట్టుకిందే కూలబడ్డారు. ఓ ముసలాయన పోనీ కదాని ఇంటికి తీసుకెళ్లి అన్నం పెడితే ఋణం తీర్చుకోవడానికి ఓ కథ చెప్తానని పట్టుబడతాడితను. అర్ధరాత్రిపూట హరికథేమిటయ్యా అన్నా వినడు. ఉన్నది ఒక్క ప్రేక్షకుడైనా 'మహాజనులారా!' అని కేకపెట్టి హరికథ అందుకున్నాడు. వాద్యగాళ్లు నిద్రమత్తులో యిష్టం వచ్చినట్టు వాయించారు.




'భోజన చక్రవర్తి' అనే కథ. అందులో అతని తిండి వర్ణిస్తాడు రచయిత. ఏడాది వూరగాయలు ఒక్కపూట భోజనంలో తుడిచి పెట్టేస్తాడు అప్పంభొట్లు. ఓ సారి పందెం కాసి రెండొందల ఆవడలు తింటాడు. పెళ్లి భోజనాల్లో మూడు విస్తళ్లు కలిపి కుట్టుకుని తెచ్చి వేసుకునేవాట్ట. గోకర్ణంతో పప్పు తెచ్చి గరిటెతో వడ్డిస్తూంటే 'వెధవ గరిటలు తీసెయ్' అని గోకర్ణం ఒంపించేవాట్ట. నేతి ఝారీతో నెయ్యి వడ్డిస్తూంటే వేళ్ల సందున ఎన్ని లోయలుండేవో తెలిసేది కాదుట. లడ్డూల బుట్ట వస్తే గాలికోసం 'ఉస్' అన్నట్టు ఎంగిలి చెయ్యి జాడించి ఆ చెయ్యి బుట్టకు తగలగా 'అంటయింది ఇంకెందుకు పనికొస్తాయి' అని బుట్టెడు లడ్లు విస్తట్లో వొంపించుకునేవాట్ట. చదువుతుంటూంటే ఆశ్చర్యం, నవ్వు కలిసి వస్తాయి.

'ఎవరా పోయేది?' అనే కథలో గొప్ప జీవితసత్యం వుంది. సూరయ్య అనే అతను అన్ని విధాలా మునిగిపోతాడు. పొలం పోయింది. కొడుకు జులాయి అయిపోయాడు. పైగా మనుమలు. కానీ అప్పు పుట్టడంలేదు. ఇక సన్యాసం పుచ్చుకుంటాడు. ఉత్తుత్తినే! వేషం అంతే. దారిన పోయే ప్రతివాడిని 'ఎవరా పోయేది?' అంటూ పలకరింపు. ఆ తర్వాత

ఎవరా పోయేది సుబ్బరామయ్యేనా?

నేనే స్వామీ పిల్చారా?

కుశలమేనా? సుబ్బరామయ్యా, స్వామివార్ని భిక్షకు పిలిచి మూణ్ణెల్లు దాటినట్లయిందే

తమ సెలవయితే..

స్వామివారు అంటే తనే అన్నమాట. ఇక ఆ మీద 'పెద్దగా ఏర్పాట్లు చేయకు' అంటూ వంటకాల లిస్టు బారెడంత చదువుతాడు. భిక్ష యివ్వాలంటూ యింటికి సంభారాలు పట్టుకుపోయి యింట్లోవాళ్లను మేపుతూంటాడు.

ఓ సారి భిక్ష ఆఫర్ చేసినవాళ్లింట్లో అశుచి వచ్చి లంచ్ కాన్సిలయిపోతుంది. ఆకలితో నకసకలాడుతూ యింటికి వస్తాడు. అన్నం పెట్టమంటే యింట్లో అందరూ బద్ధకిస్తారు. నిర్లక్ష్యం చేస్తారు. దెబ్బకి ఈయనకి నిజమైన వైరాగ్యం కలుగుతుంది. సరాసరి కాశీ వెళ్లి అసలైన సన్యాసం స్వీకరిస్తాడు.

'అప్పడాల అసెంబ్లీ' అనే ఓ కథలో ఇద్దరు ఇల్లాళ్లు మరోళ్ల యింటికి అప్పడాలు వత్తడానికి వెళ్లి చచ్చేట్లా తిట్టుకుంటారు. ఓ ముసలావిడ రాజీ కుదురుస్తుంది. ఇంటికెళ్లాక అందులో ఒకావిడ మొగుడితో అంటుంది. 'మనమ్మాయిని వాళ్లబ్బాయికి యిస్తే ఎలాగుంటుంది?' అని. అదీ మనుష్యుల తీరు.

ఇప్పుడు కొన్ని ప్రేమకథలు చెప్తాను. దర్జీ దగ్గర పనిచేసే పదేనేళ్ల కుర్రాడు. పాచిపనిచేసే పద్నాలుగేళ్ల అమ్మాయంటే వాడి కిష్టం. ఆ అమ్మాయికోసం రవిక కుట్టిపెడదామని వాడి ఐడియా. కొలతలు తీసుకుని ఒకేరంగు గల గుడ్డపీలికలన్నీ పోగేసి ఒక్కోటీ కుట్టుకుంటూ వస్తాడు. ఆర్నెల్లకి జాకెట్టు పూర్తయింది. కానీ ఆ అమ్మాయి తొడుక్కుంటే ఆ జాకెట్టు పట్టదు. ఛాతీ కొలతలు మారిపోయాయి మరి. వీడు బిక్కమొహం వేస్తాడు. 'పోన్లే మావా, పిన్నీసెట్టుకుని పైన వోణీ వేసుకుంటాన్లే' అంటుంది ఆ పిల్ల. కథ పేరు 'వయసొచ్చింది'.




కాశపడి ఓ ముసలాడికి కట్టబెడతాడు. ఏడాది తిరిగేసరికి ఆమె వితంతువు అయి తిరిగి వస్తుంది.

ఇంకో కథలో కనకాంగి వేశ్య. గొప్ప అందగత్తె. రాయుడు చేరదీశాడు. అతనితో ఐశ్వర్యం అదీ ముందులో బాగానే వుంటుంది కానీ అతను అధికారం ప్రదర్శించడంతో విముఖత ఏర్పడుతూ వుంటుంది. ఓ రోజు చాకలి సంగడు బట్టలు తీసుకోవడానికి వస్తే అతణ్ని చూసి భ్రమిసింది. కానీ క్లాస్ డిఫరెన్స్!

ఓ సారి పమిట జరీ అంచు సరిగా లేదంటూ పవిట సగం విప్పి చీర అంచు అతని చేతికిచ్చింది. ఇద్దరి ముఖాలూ చేరువలో వున్నాయి. సంగడు కనకాంగిని దగ్గరకు తీసుకుంటే ఏమయ్యాదో తెలియదు.

సంగడు ముద్దు పెట్టుకోలేదు.


కనకాంగి ముద్దివ్వలేదు.

ఇద్దరి కళ్లలో నీళ్లు ... ఇదీ సత్యం గారు కథ చెప్పే విధం. కథ పేరు 'ముద్దేలనయ్యా – మనసు నీదై యుండ'!

అమరావతి కథల్లో సామాన్యులు కూడా ఎంతోమంది కనబడతారు. 'తులసి తాంబూలం' కథలో వేణుగోపాలస్వామి గుళ్లో పూజారి. ఉన్న కాస్తమందీ మెయిన్ డెయిటీ అమరేశ్వరుడి గుడికి వెళ్లేవాళ్లే కానీ అదే కాంపౌండులో వున్న క్షేత్రపాలకుడు వేణుగోపాలుడి గుడికి వచ్చేవారు లేరు. ఈయనకు ఆదాయం లేదు. ఓ వర్షంరోజు ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. భక్తులు ఎవ్వరూ రాలేదు. ఎట్టకేలకు ఒకతను వచ్చి అర్ధరూపాయి వేస్తే సెట్టి వచ్చి అది పట్టుకుపోయాడు పాతబాకీలో జమ వేసుకుంటానంటూ. ఈయన వట్టి చేతుల్తో యింటికి వచ్చాడు. భార్య సంగతి గ్రహించి తులసితీర్థం యిచ్చింది. తాంబూలంగా తులసిదళం యిచ్చింది. అదీ 'తులసి తాంబూలం' కథ.

అలాగే 'సిరి–శాంతి' కథలో గొల్ల సిద్దయ్యకి పొలంలో ఓ వజ్రం దొరికింది. రత్నవర్తకుడైన ముత్యాలయ్య చేతిలో పెట్టి ఓ పొగాకు కాడ యివ్వండి, ఈ రాయి తీసుకోండి అన్నాడు. అతను బలే ఛాన్సు అనుకున్నాడు. వేంకటాద్రి నాయుడికి ఈ సంగతి తెలిసి పదిలక్షలిచ్చి అది కొని ఇంకో పదిలక్షలిచ్చి అదెక్కడ దొరికిందో కనుక్కుని సిద్దయ్య పొలానికి వెళ్లి మరిన్ని రత్నాల్ని తవ్వుకున్నాడు. నీకేం కావాలంటే 'నాకేం వద్దు' అన్నాడు సిద్దయ్య. పదెకరాల మాన్యం, బండెడు పొగాకు యిచ్చాడు నాయుడు.

సిద్దయ్య జీవితమంతా కమ్మగా తిన్నాడు, పదిమందికి పెట్టాడు హాయిగా చుట్ట కాల్చుకుంటూ. తృప్తిగా వెళ్లిపోయాడు. ఆ తృప్తి నాయుడుకీ, ముత్యాలయ్యకి దొరకలేదు.




నక్కాలు మాస్టారు, కోతుల్ని ఆడించేవాడు, పోస్టుమాస్టరు – వీళ్లందరూ అమరావతి కథల్లో కథానాయకులే! పూలు

కథ. వాచీ రిపేరరు చలపతి గురించి కూడా కథే. రిపేరుకు వచ్చిన వాచీలను దానం చేయడం అతని హాబీ. అసలు వాళ్లొచ్చి గోలపెడితే కిరసనాయిల్లో వేశానని దబాయింపు ఒకటి. పోలీసు నిక్కరు వేసుకుని పోట్లాట కెళితే విజయం తథ్యం అని అతనికో సెంటిమెంటు.

ఇలాటి వాళ్లు మీ వూళ్లోనూ మీకు తగిలే వుంటారు. సత్యంగారు వాళ్ల మీద కథలు కట్టారు. అదీ విశేషం.

అమరావతి కథల గురించి మీకు అన్నీ పూర్తిగా చెప్పటంలేదు. అవి మీరు స్వయంగా చదవాలని నా కోరిక. కథలకు బాపు గారు వేసిన బొమ్మలు చూసి తరించాలని నా ఆశ (దీనిలో శాంపుల్ చూపించానంతే!) కథలకు, బొమ్మలకు ముళ్లపూడి వెంకటరమణగారు ముందుమాటలో చేసిన వ్యాఖ్యానం చదివి తీరాలని నా ఆకాంక్ష. అనుభవేక వేద్యం అంటారు చూడండి. కొన్ని అనుభవిస్తేనే కానీ తెలియవంటారు. ఇవీ అలాటివే.

అన్నీ కథలు కావు. కొన్ని జస్ట్ లిరికల్ బ్యూటీకి చదవాల్సిందే. స్తంభన అని ఓ స్కెచ్. గాలి ఎక్కడెక్కడినుండి వెళుతోందో వర్ణిస్తాడు.


బిలా బిలా గాలి, జల జలా గాలి... అలలు అలలుగా గాలి
లోకమంతా మేల్కొనట్లు, కటిక చీకట్లో గప్పున వెలుగొచ్చినట్లు
బయ్‌బయ్‌మని గాలి, రయ్‌రయ్‌మని గాలి

ఆ గాలి కృష్ణకు వెళ్లిందిట. ఆ తరువాత అమరేశ్వర శిఖరం ధ్వజస్తంభాన్ని చుట్టిందట. స్తంభం చిరుగంటలు వూపిందట. పక్కనున్న వేపచెట్టు కొమ్మెక్కి గంతులేసిందట. చిన్నరథం మీది చెక్కిన చిలకల ముక్కులు ఎవరో విరగ్గొడితే వాటిని జాలిగా బుజ్జగించిందట...శాంపిల్ చాలుగా..

ఎమ్వీయల్ అన్నారు – 'శంకరమంచి చెప్పాడు, కృష్ణమ్మ వింది, కడుపులో దాచుకుంది, తరతరాలకూ చెబుతుంది' అని. అలాగ ఈ కథలు తెలుగు జాతివి. అందుకే మనం ఎంజాయ్ చేస్తాం.

చివర్లో 'ఎపిలోగ్' అంటారుగా అలాగ 'మహారుద్రాభిషేకం' అని అమరేశ్వరుణ్ని ఉద్దేశించి సత్యం గారు రాశారు.

లే తండ్రీ! లే
తలార తనివితీర స్నానమాడు
స్నానమాడి శాంతించు నరుడా
దీవించు హరుడా
హరహర మహాదేవ
నరహర మహాదేవ



# మిట్టూరోడి కథలు

మిట్టూరు అనేది చిత్తూరు జిల్లాలో ఓ వూరు. వెనుకబడ్డ ప్రాంతమే. కష్టజీవులే ఎక్కువమంది వున్నారు. ఆ వూరివాడే రచయిత అయిన నామిని సుబ్రహ్మణ్యం నాయుడు. తనను తాను సినబ్బ అని, మిట్టూరోడు అని అనుకుని అక్కడ జరిగినట్టు రాసిన కథలే 'మిట్టూరోడి కతలు'! ఆత్మకథల్లా రాసుకున్నాడు. ఉత్తమ పురుష - ఫస్ట్ పెర్సన్- లో రాయడం అనే కాదు, నిజంగా తన ఉద్యోగం, చదువు అన్నీ ఉన్నదున్నట్టు రాసేశాడు.

సాధారణంగా ఆత్మకథలు రాసేవాళ్లు తామెంత కష్టపడ్డారో, ఏ విధంగా పైకి వచ్చారో రాస్తూంటారు. కానీ దీనిలో రచయిత తనని గురించి తను ఎంత హంబుల్‌గా, సబ్‌ద్యూడ్‌గా రాసుకున్నారో చెప్పనలవి కాదు. తనని చూసి తాను నవ్వుకోవడమే కాదు, మనసీ నవ్వమంటారు. అలా నవ్విస్తూనే ఆ మనుష్యులనూ, వారి కష్టసుఖాలనూ, మనస్తత్వాన్నీ, మానవీయతనూ ఆవిష్కరిస్తారు.

నిజం చెప్పాలంటే ఈ కథలు ముందులో నాకు కొరుకుడు పడలేదు. కారణం - మాండలిక భాష!

మాండలిక భాష అంటే ఏమిటి? ఏది శిష్ట వ్యావహారికం? ఏది మాండలీకం? ప్రస్తుతం వార్తా పత్రికల్లో, కథల్లో, నవలల్లో, సినిమాల్లో వినబడే పదాలు, వ్యక్తీకరణ శిష్ట వ్యావహారికం తక్కినవి మాండలికం అనేస్తున్నాం. ఈ వార్తా పత్రికల భాష ఎవరు తయారు చేశారు? నాకు తెలిసున్నంతవరకు తెలుగులో వార్తా పత్రికలు ప్రారంభమైన కొత్తల్లో కృష్ణా, గుంటూరు జిల్లాలవారు విలేకరులుగా, పత్రికా రచయితలుగా ప్రవేశించారు. వారి భాషే ప్రామాణికం అయిపోయింది. అదే అందరూ అనుసరించారు.

ఇక అది కాని ప్రతీదీ వింతగా, విడ్డూరంగా అనిపించసాగింది. ఉదాహరణకి అందరం ప్రామాణికంగా తీసుకునే బ్రౌన్ తెలుగు నిఘంటువు తీసుకోండి. 150 యేళ్ల క్రితం 1853లో కడపలో తయారయింది. ఆయనకు సహాయకులుగా వున్నవారందరూ రాయలసీమకు చెందిన పండితులే! అందులో ఇంగ్లీషు పదాలకు అర్థాలుగా యిచ్చిన తెలుగు భాష మచ్చు చూపిస్తాను. he broke the ice and told me this అంటే '..వాడు నాతో దాన్ని యెత్తి ప్రస్తాపము చేసినాడు' I came in the idea that they were here 'వాండ్లు యిక్కడ వున్నారనే



రాస్తే యిలా రాస్తారా? 'యెత్తి ప్రస్తాపము చేసినాడు' అంటారా? యెత్తి అంటే 'తీసుకుని' అన్న అర్థంలో వాడతారా? వాండ్లు అంటారా? వాళ్లు అంటాం. వస్తిని - నో, వచ్చాను. ఎందుకీ మార్పు? బ్రౌన్ తెలుగు పండితులు తెలుగువాళ్లు కారా?

మార్పు ఎందుకంటే పత్రికల భాష వల్ల మనమందరం వీటికి దూరమయ్యాం. అందుకే త్యాగరాజ స్వామి కీర్తనల్లోకూడా 'నెనరుతో పాలించు', 'కూరిమితో కాపాడు' వంటి మాటలొస్తే బిక్కమొహం వేస్తున్నాం. ఆ మధ్య ఒకావిడ - సంగీత విమర్శకురాలు - త్యాగరాజస్వామికి తెలుగు అంత బాగా రాదని అంది కూడాను!

సముద్రాలవారు, ఆత్రేయ డైలాగుల్లో 'అవసరపడి అన్నానయ్యా' అని వినబడుతుంది. తొందరపడి అన్న అర్థంలో వాడారది. రాసిన పాటల్లో 'నెమ్మది' అని కూడా వాడారు. అంటే స్లో అనే అర్థంలో కాదు, మనశ్శాంతి అనే అర్థంలో! ఇదంతా రాయలసీమ భాష. కానీ క్రమేపీ యిందాకా చెప్పిన పత్రికల భాషే డామినేట్ చేసేసింది.

తెలంగాణా వాదులు తరచుగా చేసే ఫిర్యాదు ఒకటుంది. సినిమాల్లో తెలంగాణా భాషను హాస్యపాత్రలకు వాడి వెటకరిస్తున్నారని. జాగ్రత్తగా గమనిస్తే తెలుస్తుంది. తెలంగాణా భాషనే కాదు, ఏ మాండలికాన్నైనా సరే హాస్యపాత్రకే పరిమితం చేస్తారని. హీరో, హీరోయిన్లు అమలాపురం వాళ్లయినా సరే, అనంతపురం వాళ్లయినా సరే వాళ్లు చచ్చినట్టు శిష్ట వ్యావహారికం మాట్లాడవలసినదే!

హాస్యనటుడు కాబట్టి రమణారెడ్డి చేత నిర్మాతలు నెల్లూరు యాస మాట్లాడించారు. అందుకు నెల్లూరు వాళ్లు నొచ్చుకోలేదు. ముళ్లపూడి రమణగారు హాస్యపాత్రలచేత గోదారి యాస మాట్లాడిస్తే గోదావరి వాళ్లు ఫిర్యాదు చేయలేదు. గణేష్‌పాత్రో రాసిన సినిమాల్లో హాస్యపాత్రల చేత తూర్పు యాస మాట్లాడిస్తే ఉత్తరాంధ్రవాళ్లూ నవ్వారు కానీ మూతి ముడుచుకోలేదు. అందువల్ల హాస్యపాత్రలకు యాస పెట్టినంత మాత్రంలో మాండలికానికి అన్యాయం జరిగిపోదు.

మాండలికాల గురించి ఇంత చర్చ ఎందుకంటే ఈ క్షేత్ర కథానికలన్నీ మాండలికాలతో అల్లినవే! ముఖ్యంగా మిట్టూరోడి కతలు, దర్గామిట్ట కతలు, పసలపూడి కథలు! సాధారణంగా కథలు రాసినప్పుడు కథకుడు సినిమాలో హీరో లాటివాడు. తను మాత్రం శిష్ట వ్యావహారికంలో కథ చెబుతూ, పాత్రల సంభాషణ మాత్రం మాండలికంలో రాస్తాడు. ఆ విధంగా నేటివ్ టచ్ ఉంటుంది, ఎట్ ది సేమ్‌టైమ్ రీడబిలిటీ వుంటుంది. కానీ ఈ కథల్లో రచయితకూడా మాండలికంలో రాయడంతో యిబ్బంది వచ్చిపడింది.

నా మట్టుకు నాకు మాండలికాలంటే చికాకు. మనసులో ప్రతి మాటనూ స్టాండర్డ్ తెలుగులోకి అనువదించుకుంటూ చదవడం పెద్ద శ్రమ. 'మట్టి వాసన' అంటూ మాండలికంలో, అందునా రైతుల కష్టాల గురించి కథలు చదవమంటే ఏడుపు వస్తుంది. మనమా వర్షాలు కురిపించలేం. వాళ్ల ఆరళ్లు తీర్చలేం. అందుకని పేజీ తిప్పేస్తాను. మాండలికంలో హాస్యం వుంటే కాస్త టెమ్ప్ట్ అవుతాను. నామిని వారి 'మిట్టూరోడి కతలు' అందుకే మొదలెట్టాను. కానీ నాలుగు కథలయ్యేసరికి పక్కన పెట్టేశాను.



వున్నట్టే, కంటెంట్ , వ్యక్తీకరణ విషయంలో బ్రాహ్మల ప్రభావం వున్నట్టుంటుంది. తొలితరంలో ఎక్కువమంది రచయితలు వారే కదా! వారికి తెలిసిన కొన్ని విషయాలపైననే రాయడం జరిగింది. 'అంటరానోళ్ల ఆత్మకతలు' చదివేదాకా పందిని పట్టుకోవడం గురించి కథ రాయచ్చని నాకు తట్టనేలేదు. వ్యక్తీకరణ విషయంలో కూడా ముందునుండీ కొన్ని మర్యాదలు పాటించారు. నిత్యజీవితంలో బూతులు ప్రయోగించేవారు కూడా రచనల్లోకి వాటిని ఎక్కనివ్వలేదు.


కానీ నామిని అలాక్కాదు. మనకు వెలపరం కలిగించే మాటలు అనేకం వాడాడు. ఇరుగు పొరుగు ఆడవాళ్లను, తనకంటె పెద్దవాళ్లను 'లంజా' అని ప్రేమతో సంబోధిస్తాడు. ముసలాడవాళ్లను పట్టుకుని 'నేను నీ మిండగాణ్ని' అని మోటు సరసం ఆడతాడు. పెళ్లం తనను నాలుగు గుద్దులు గుద్దిందని చెప్పుకుంటాడు. ఆడవాళ్లందరూ తనను 'ముండ నా బట్టా' అని సంబోధించేవారంటాడు. ఇవన్నీ థర్డ్‌పెర్సన్‌లో కాదు, తన గురించి తను చెప్పుకుంటూనే - ఏదీ తన ఆంధ్రజ్యోతి ఉద్యోగం, తన ఎమ్మెస్సీ చదువు అన్నీ చెప్పుకుంటూనే - చెప్తాడు.

నేను బూర్జువానో, భద్రలోక్‌నో తెలియదు కానీ యివన్నీ నా గొంతు కడ్డం పడ్డాయి. 'వద్దు నాయనోయ్' అని పక్కన పడేశాను. కానీ బాపూరమణలకు ఈ కతలు బాగా నచ్చాయని తెలిసింది. వాళ్లిద్దరూ నామిని ఊరెళ్లి అతన్ని అభినందించి వచ్చారట. బాపుగారు నామిని నాన్నగారి బొమ్మకూడా వేసి బహూకరించారట. 'ఓరి నాయనోయ్, అయితే ఈ నామినెవరో గొప్పవాడయివుంటాడ్రా' అనిపించింది.

మనకు యిదివరకైతే పియర్స్, మార్గదర్శకులు వుండేవారు. 'ఇది చదువు, అది చూడు' అని చెప్పేందుకు. ఇప్పుడు ఎవరికీ తీరికలేదు. మనం చీకట్లో పడి కొట్టుకుంటున్నాం. అందువల్ల స్ఫూర్తిప్రదాతలైన బాపు రమణగారి లాటి వాళ్లని ఓ కంట కనిపెడుతూ వుండాలి. వాళ్లు సెలబ్రిటీస్ అన్న ఫ్యాక్టర్ తర్వాత. మొదటగా మంచి రసజ్ఞులు. మొహమాటాలు, మెహర్బానీలకు పోరు. అందువల్ల వాళ్లకు నచ్చినవాళ్లను, వాళ్లు మెచ్చినవాళ్లను మనం కూడా రుచి చూడాలి.

మిట్టూరోడి కతలు కూడా నేను అలాగే రుచి చూశాను. నచ్చాయి కాబట్టే మీ అందరికీ చెబుతున్నాను.

'మిట్టూరోడి కతలు' లో మొదటి కథ 'బతుకుగోరే తల్లి'. ఓ తల్లీ, కూతురూ పరస్పరం తిట్టుకోవడంతో కథ ప్రారంభమవుతుంది. తల్లి కూతుర్ని పెళ్లి చేసి పంపించింది. కూతురికి ఓ కూతురు కూడాను. ఈ కూతురు ఓ రోజు వచ్చి ఇరవై రూపాయలు కావాలని అడిగింది. తల్లి యివ్వనంటోంది. కానీ గంటముందు నూర్రూపాయలు రెండ్రూపాయల వడ్డీకి యింకోళ్లకి అప్పిచ్చింది. కూతురికి ఆ విషయం తెలుసు. నాకు ఇరవై రూపాయల్లేవంటావా అని తగువేసుకుంది.




ఆ తగవులో ఆ కూతురూ, ఆ తల్లీ తిట్టుకున్న తిట్లు రాస్తాడు నామిని - 'నిన్ను గని నేనేమి సుకపడినట్టు?' అని తల్లంటే, కూతురంటుంది - 'నువ్వు నన్ను కన్నావా? నా సవితీ, కక్కినావు, వొక తిక్కలోడి ఎదాన తోసినావు. నా మంచేమి చెడ్డేమి అని ఓ పొద్దన్నా సూసినావా సేయ్?'

మాటామాటా పెరిగి ఓ గంట కొట్లాట

వెళుతుంది.

కూతురు వెళ్లిపోయేక ఆ తల్లి వద్దకు రచయిత వెళ్తాడు. ఏవిటత్తా యిలా చేశావ్? అంటాడు. ఆమె 'చెప్తాను ఇనురా నా బట్టా! ఎవుర్ది తప్పుంటే వాళ్లను కొట్టు నా ఎడంకాలి మెట్టెతో!' - మెట్టె అంటే చెప్పు - అని తన వాదన వినిపిస్తుంది. 'నా కూతురుకి ఆదాయం వుంది. కానీ ఖర్చు ఎక్కువ. తన పిల్ల గురించి ఏమీ దాచటం లేదు. పిల్లలను కన్నాక మనగ్గాదు నోరుండేది మన బిడ్డకు అనుకోవాలి. ఇవాళ దీనికి ఇరవై రూపాయలు యివ్వలేదుగదా. ఇప్పుడే రెండువందల రూపాయలు తీసుకుని తిరుపతి వెళ్లి నా మనవరాలు - అదే దాని కూతురు - దానికి వెండి గొలుసులు కొంటున్నా. అది అడుగు తీసి అడుగులేస్తోందిట.'

అదీ తల్లిమనసు. పిల్లల గురించే కాదు. పిల్లల పిల్లల గురించి కూడా ఆలోచిస్తుంది.

తల్లి మనసు గురించే మరో కథ - 'మా రామస్వానం ఎందుకు బతకతా వుండాదంటేనంట..' అని. రామస్వానం అని ఓ ముసలావిడ. పండు ముసలిదై పోయింది. ఉన్న భూమి సాగు చేద్దామని ఆమె కొడుకు బావి తవ్విస్తే అందులో యిసక వచ్చింది. 30 వేల దాకా అప్పయిపోయింది. గడవడం కష్టమయి తిరుపతికి బండి బాడిగకు తోలుకుంటూ బతుకుతున్నాడు. కొడుకు బతుకు యిలా అయిందేనన్న బాధతో రామస్వానమ్మ మంచం పట్టింది.


ఈ కథకుడు వెళ్లి ఆమెను ఆట పట్టిస్తాడు - 'ఎందుకొచ్చిన బతుకిది, టిక్కెట్టు తీసుకోకుండా?' అని. ఆమె కూడా కాస్సేపు తమాషాగా జోకులేసి ఆ తర్వాత చెప్తుంది - 'నా కొడుకు వుండే అప్పుతోనే అల్లాడుతున్నాడు. ఈ టైములో నేను చస్తే మళ్లా మూడువేలు అప్పుజేసి నాకు దినాలు జెయ్యాలి. దినం చెయ్యకుంటే నీబోటి వోళ్లు వూరుకుంటారా? అందువల్ల మా అప్పు తీరేదాక నేను బతకాల్సిందేరా' అంటుంది.

ఈ కథకి బాపుగారు గొప్ప బొమ్మ వేశారు. పోవడానికి సరైన టైము గురించి ఎదురుచూస్తూ భీష్ముడు అంపశయ్య మీద శయనించినట్టు ముసలావిడ కంకుల మీద శయనించినట్టు ఉంటుంది. ఆ కంకులు ఎదగాలి. అప్పుడే ఈవిడ నిష్క్రమిస్తుందన్నమాట.

'అమ్మకు జేజే' అని మరో కథ. కథకుడికి, తల్లికి మంచి దోస్తీ. పెళ్లయినా కూడా తల్లి కొంగు పట్టుకు తిరుగుతున్నాడని అత్తగారి ఫిర్యాదు. ఇతను హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నవాడు తల్లికి దగ్గరగా వుండాలని చిత్తూరు జిల్లా వచ్చేస్తాడు. ఆఫీసు తిరుపతిలో వుంది. అక్కడైనా వుంటాడేమో అనుకుంటే అక్కడ కూడా వుండకుండా తల్లికి దగ్గరగా వుండాలని మిట్టూరులో కాపురం పెడతాడు. దర్జాగా హైదరాబాదులో, కనీసం తిరుపతిలో వుండకుండా రెండు బస్సులు మారి వెళ్లాల్సిన పల్లెటూరిలో వుండడం అత్తగారివాళ్లకి రుచించదు.

ఓ రోజు నామినీ, తల్లీ కబుర్లు చెప్పుకుంటూ కూచుంటారు. ఓ గంటపోయాక తల్లి 'ఒరే నువ్వు పెళ్లాం దగ్గరకు పో. పెళ్లయ్యాక తల్లేమిత్రా సన్నాసీ, లేకపోతే అది కుళ్లుకుంటుంది' అంటుంది.

ఇంతలో ఉన్నట్టుండి నామిని భార్య తలుపు [illegible]






వీళ్లకి తెలియక వేళాకోళం చేసినందుకే అలిగిందనుకుని కంగారుపడి పోతారు. తల్లీ కొడుకు బతిమాలతారు.

ఆమె వీళ్లని కాస్సేపు ఏడిపిద్దామని 'ఎంతసేపూ నీకు తల్లే తప్ప పెళ్లాం అక్కర్లేదు. ఉరేనుకుంటా' అంటూ బెదిరించి, బతిమాలించుకుని తలుపు తీస్తుంది.

అప్పుడు తల్లి చెపుతుంది - 'పాదాలుండగా ఎవరూ శిరసుకు పూజ చేయరు. తల్లుండంగా పెళ్లానెవ్వరూ నెత్తిన పెట్టుకోరు తల్లీ. మేం చిన్నప్పటినుండీ అలాగే బతికాం.' అని అంటుంది.

లోకనీతిని ఎంత గొప్పగా, ఎంత తమాషాగా చెప్పాడో చూడండి!

నామిని తన యాస భాషలో రాయడానికి కారణం చెప్పారు. అదీ కథల ద్వారానే 'బాస కత బక్కమ్మకి తెలుసు' అనే కథ ప్రారంభం ఇలా వుంటుంది -

మడికాడ గుంటగింజేరాకుతో పొండ్లు తోముకోని శుబ్బరంగా యింటికొస్తావుంటే 'వోరే ఆంద్రజ్యోతి ఎడీట్రా ఇటా' అని నన్నడ్డగించుకున్నారు బజిన గుళ్లో వుండే మొగోళ్లు. (వీళ్లే కొంచిం మేల్లే. మా అత్తగారూర్లో నాకు పిల్లనిచ్చినోడైతే 'మావోడు ఆంద్రజోతికి చీఫ్ ఎడీట్రబ్బా. రేపో ఎల్లుండో ఎడీట్రగా ప్రమోసం ఈబోతారు' అని చెప్పుకుంటా వుంటాడు)

మనకు మొదుట్నుంచి గూడ మొగోళ్లతో ఎక్కువగా మాట్లాడే అలవాట్లు లేవు. మొగనాకొడకల్తో ఒకటి మాట్లాడితే తక్కువ, రెండు మాట్లాడితే ఎక్కువ. నేను నెత్తి గొట్టుకుంటా బజిన గుళ్లోకి పొయ్ కుచ్చున్నా.


కోళ్లపారం కాడికి దినామూ పొయ్ పేపరు చదివేటొకడు 'అద్సరేగానీ ఈ చంద్రశేకర గవుర్మెట్టు చీత్తే వూడిపొయ్యే ముక్కేనంటావా? అమెరికా యిమానాలకు ఆయన దగ్గరుండి పెట్రోలు పొయ్యడం మాత్రం బలే ముదావకం' అన్నాడు.

...ఇదీ బిగినింగ్.

ముదావకం అంటే ముదావహం అన్నమాట. పేపర్లో ఎడిటోరియల్ రాసినప్పుడు ఈ 'ముదావహం' 'అభిలషణీయం' 'అభిశంసన' వంటి పదాలు తెగ వాడతారు. వాటి అర్థాలు తెలిసినా తెలియకపోయినా మగాళ్లు వాటిని తమ మాటల్లో చొప్పిస్తారు. క్రమంగా భాష రూపురేఖలు మారతాయి. గ్రాంథికాలు, అన్యభాషాపదాలు వాడి అచ్చమైన భాషను భ్రష్టు పట్టిస్తారు. కానీ ఆడవాళ్లు నేటివ్ టంగ్‌ను వదిలిపెట్టరు.

గోదావరి యాసలో అద్భుతమైన కథలు రాసిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తను భాషను ఆడవాళ్ల దగ్గిర నేర్చుకున్నానని అన్నారు. వాళ్ల దగ్గిరే అసలైన భాష ఒరిజినల్ ఫామ్‌లో, భద్రంగా వుంటుంది. ఆ విషయాన్నే నామిని యిలా వెక్కిరింతగా చెపుతున్నాడు. చంద్రశేఖరు పెట్రోలు కొట్టించడం ముదావహంగా.. కాదు ముదావకంగా వుందట.

అందుకే నామిని అంటారు - 'మొదుటసల్లో మొగోళ్లతో మాటలే ఇంత అనర్థంగా వుంటాయి.



మనూర్లో అయిదారు మంది మొగ పిలకాయలు నెల్లూరు ట్రైనింగ్ కాలేజిలో చేరి, పోయిన బస్సుకే తిరుక్కొనొచ్చి 'ఏంటీ ఎలా వున్నారూ?' అని రాజమండ్రోళ్ల మూదిర్తో బారడు పొడుగు దీర్గం తీస్తావొస్తిరే. వాళ్లకత చెప్పద్దా?' అంటుంది.

ఇంద్రాణికి సపోర్టుగా ఒకావె 'హైదరాబాదులో కాపురం వుంటూ మిట్టూరు భాష మాట్టాడితే మర్యాదగా వుంటుందా?' అని వెనకేసుకొస్తుంది.

దానికి నామిని 'నన్ను ఏడేడు పద్నాలుగేళ్లు రాజమండ్రి జెమినీలో పెట్టినా నేను మిట్టూరు మాటే మాట్టాడతా' అని చాలెంజ్ చేస్తాడు. అని యాస గురించి తనకు, తన భార్యకు జరిగిన సంభాషణ చెప్తాడు.

హైదరాబాదులో వుండగా నామిని భార్య అతన్ని పట్టుకుని 'ఏమబ్బా, నువ్వు మొగోడివైతే యండమూరి, మల్లాది రాసే భాషలో రాయి' అని సవాలు విసిరిందట.

'ఆ భాషలో వాళ్లిద్దరూ రాస్తున్నారుగా, చాల్దా? ఆ పంగమాలిన భాష రాసే దానికి ఈ సినక్క కొడుకు సుబ్రమణి గావాలా?' అని తనకు తనే పటం గట్టుకున్నాట్ట.

వాళ్లావిడ ఓ రోజు ఓ కథ రాసి చూపించిందిట. అమలాపురంలో ప్రదీప్‌కుమార్ అనేవాడు స్కూటర్‌లో పోతూపోతూ దానెవర్నో 'యెనకా నెక్కు' అంటాట్ట.

ఆ కాగితాన్ని చింపి ముక్కలు ముక్కలు చేసి 'అమలాపురం ఏ జిల్లాలో వుందాదే లంజా?' అని అడిగాట్ట నామిని.

'గుంటూరు' అని సమాధానం.


'అమలాపురం ఏ జిల్లాలో వుండాదో గూడ తెలియకుండా ఆ వూరోళ్లమింద కతలు రాస్తావంటే లంజా? ఇట్టా కత గాని రాసి తెస్తే కోరట కేసి ఇదాకులిచ్చేస్తాన్' అని బెదిరించాట్ట. 'లేకపోతే అది ఇద్రాబాద్ నుంచి మా వూరు రాంగానే విజీవాడవాళ్లల్లా ఏమండోయ్ అని తయారై వుండేది కదా' అని తనను తాను సమర్థించుకుంటాడు.

చదువుతూంటే మోటు సరసంలా అనిపించినా కొన్ని బేసిక్ ట్రూత్స్ వున్నాయి. విషయం తెలిసీ తెలియకుండా కలం పట్టేవారిమీద విసుర్లున్నాయి.

ఇంతకీ ఆ ఇంద్రాణి కృతకమైన భాష గురించి చెపుతున్నాను కదూ. ఈ నామిని ఆమె దగ్గరకి వెళ్లాట్ట. 'ఏంటో అన్నయ్యా, సిటీలో ఈ రోజు అంతా ఈ రోజు నల్లా వుంటే రేపు నల్లా వుండదు. అయ్యబాబోయ్ ఆ పాట్లు' అందిట.

నల్లా అంటే కుళాయి. హైదరాబాదు భాష వంటపట్టించుకుని ఆ షోకంతా ఇక్కడ ఒలకబోస్తోందన్నమాట. ఇక దానికి తోడు వచ్చీ రాని బొట్లేరు ఇంగ్లీషొకటి.

'నువ్వేమో ఏకంగా నెగటివ్ ప్లేస్ కొచ్చి చేరిపొయ్యావు. హాయిగా వుందా అన్నయ్యా' అందిట. నేటివ్‌ప్లేస్‌కు బదులు నెగటివ్ ప్లేస్ అందన్నమాట.




వీళ్ల యింట్లో అయిదు చింత చెట్లుంటాయి. దాంట్లో వీళ్లకూ, వీళ్ల కజిన్లకూ అందరికీ వాటాలున్నాయి. ఓ రాత్రి తుపాను గాలి వస్తే చింతకాయలు రాల్తాయి. నామినీ, వాళ్ల అమ్మా కలిసి అవి ఎత్తుకు వచ్చేస్తారు. పగలు మిద్దెమీద ఆరబెడితే ఎవరో ఎత్తుకుపోతారు. ఎత్తుకుపోయిందెవరా అని నామిని ఆరా తీయబోతే ఫలానా ధనలక్ష్మి అని చెబుతుంది నీలావతి.

ఇతను ధనలక్ష్మి వద్దకు వెళ్లి నీలావతి నిన్ను దొంగ అంది అని చెప్తాడు. ఇక ఆమె నీలావతిమీద పోట్లాటకు వస్తుంది. ఇద్దరూ 'నువ్వు జెంటిల్‌మను అంటే నీ తాత జంటిల్‌మేన్' అనుకుంటారు. ఈ జెంటిల్‌మన్ల చేత జుట్లు పట్టించిన నారద మహాముని నామిని కడుపు నిండినవాడై ఆఫీసుకి బయల్దేరతాడు. అప్పుడు వాళ్లిద్దరూ మేల్కొని 'అసలు జంటిల్‌మెన్ ఈ సినబ్బే' అంటూ ఇతన్ని తిట్టడానికి మళ్లుకుంటారు.

కలహం పెట్టిన నామినిని వాళ్లిద్దరూ కలిసి తిట్టడం హాస్యస్ఫోరకంగా అనిపించినా, అందులో ఓ అండర్‌లైయింగ్ వాస్తవం వుంది - నిజానికి వాళ్ల వాటాకు రాని చింతకాయలు కోసుకొచ్చిన దొంగేగా ఇతను!

ఇలా రస్టిక్ హ్యూమర్‌తో బాటు గ్రామీణుల్లో వుండే కిల్లాడి తనం కూడా కథల్లో చూపించారు నామిని.

గ్రామీణులందరూ సినిమాలో చూపించినట్టు అమాయకులుగా వుండరు. వాళ్లలో కూడా కిల్లాడితనం వుంటుంది. ఆ వైనం చెప్పే కథలు కొన్ని వున్నాయి.

చెంగాళత్త అని ఒకామె వుంటుంది. కూరలమ్మి, పాలమ్మి, పేడ అమ్మి, బాగానే సంపాదిస్తూ వుంటుంది. అయినా పిసినారి. కడుపునిండా తిన్నట్టుగా దొంగ త్రేన్పులు తేన్పుతూ వుంటుంది. ఓసారి నామినిని పలకరించి 'బులుకోసు బాటిళ్లు ఎక్కించుకోవాలనుంది' అంటుంది. బులుకోసు అంటే గ్లూకోజు అన్నమాట. అవి ఎక్కించుకుంటే నరాల్లోకి డైరక్టుగా సత్తా వస్తుందని ఆమె నమ్మకం.

ఇతను హితవు చెప్తాడు - 'గ్లూకోజు అంటే మంచినీళ్లతో సమానం. పాలు అమ్మకం మానేయి. కూరలమ్మకం మానేయి. హాయిగా నువ్వే తిను, తాగు, అనుభవించు. దానంతట అదే సత్తువ వస్తుంది' అని. ఆ సలహా ఆమెకు రుచించదు. డాక్టరు వద్దకే వెళుతుంది. అతను దినానికి పది చొప్పున గ్లూకోజు బాటిళ్లు ఎక్కించుకో మంటాడు. గాడిదగుడ్డు కదూ అనుకుని ఈమె రిక్షా ఎక్కి రూయా ఆస్పత్రి అనే గవర్నమెంటు ఆస్పత్రి దగ్గరదాకా వచ్చాక కళ్లు తేలేసి వెల్లకితలా పడిపోతుంది. వాళ్లు చచ్చినట్టు ఈమెను ఎడ్మిట్ చేసుకుని గ్లూకోజు బాటిల్స్ ఎక్కిస్తారు. రొట్టీ పాలూ యిచ్చినా ఈమె ముట్టదు. ఓ ఇరవై రోజులు మకాం వేసి, నూరు బాటిళ్ల గ్లూకోజు ఎక్కించుకుని తృప్తిగా ఆసుపత్రిలోంచి బయటకు వస్తుంది. ఈ కథ పేరు 'రొయ్యాస్పత్రిలో చెంగాళత్త డ్రామా'. రూయా ఆస్పత్రినే నోరు తిరగనివాళ్లు రొయ్యాసుపత్రి అంటారన్నమాట!

ఇదేమిట్రా యిలా చేశావ్? అంటే 'ఇంట్లో ఎంత మంచి కోడిపుంజు వున్నా ఏం లాభం? ఇంట్లో ఆడాళ్లు 'మనం తినొద్దు. మార్కెట్లో అమ్మ'మంటారు. తాగే పాలను తిరపతిలో అమ్మమన్నట్టు కోళ్లు కూడా అమ్మమంటారు. ఇక మనం తినేదెప్పుడు? అందుకే ఇలా చేశా.' అంటాడు.




అప్పుడు ఇద్దరు మగాళ్ల మధ్యా ఓ ఒప్పందం కుదురుతుంది. 'నీ పుంజు నా యింటికి వస్తే నాది. నా పుంజు నీ యింటికి వస్తే నీది.' అని. అంటే కోసుకుని తినేయచ్చన్నమాట. స్వంతది అమ్ముకోకుండా మనమే తినేస్తే బాధేస్తుంది. అదే దొంగసొమ్ము ఆరగిస్తే మహా సంతోషం కలుగుతుంది. కథ పేరు చెప్పమంటారా? 'నా పుంజున్నువ్వు... నీ పుంజున్నేను'!

నామిని ఫ్రెండు అంజిగాడి వద్ద ఓ ఆవు వుంది. అది పాలివ్వటం లేదు. పాలు పితుకుదామని వెళితే తంతోంది. ఎలా వదుల్చుకుందాంరా అని చూస్తూంటారు. కానీ తెలిసున్నవాళ్లెవ్వరూ కొనరు. ఇంతలో అది చూడిదవుతుంది. నిగనిగలాడుతూ తోమిన గుర్రంలా తయారవుతుంది. ఓ రోజు నామిని, అంజిగాడు గొడ్లను మేపుకుంటూ ఊరిబయట వుంటారు.

అక్కడికి ఇద్దరు బేరగాళ్లు వస్తారు. ఆవును చూసి ముచ్చటపడతారు. వీళ్లను చూసి పల్లెటూరి బైతులనుకుంటారు. ఎందుకంటే ఇద్దరికీ చొక్కాలుండవు. వీళ్లను వెర్రివాళ్లను చేసి చౌకగా కొట్టేయాలనుకుని వాళ్లు బేరమాడతారు. వీళ్లూ సంగతి గ్రహించి వెర్రాళ్లలాగానే నటిస్తారు. చివరికి వాళ్లు రెండున్నర వేలు యిచ్చి అప్పటికప్పుడు కొనుక్కుని పట్టుకుపోతారు. ఎలా వదుల్చుకోవాలా అని చూస్తున్న వీళ్లకు అది బోనస్ అన్నమాటే!

వీళ్లిద్దరూ ఇంత అన్యాయంగా ప్రవర్తించారే అనిపిస్తుందికదూ, కానీ దానికి కారణం కూడా ముందే చెప్తాడు రచయిత. ఆవు కావాలని బ్యాంకు లోను తీసుకుంటాడు అంజిగాడు. వాళ్లు డబ్బిచ్చేస్తే వీళ్లకు కావలసినది వీళ్లు కొనుక్కుందురు గానీ బ్యాంకువాళ్లు ఎవరితోనో కుమ్మక్కయి ఈ ఆవునే కొనుక్కోవాలని, లేదంటే లోను కాన్సిలు చేస్తామని బెదిరిస్తారు. చూడ్డానికి బాగానే వుంది కదాని ఇతను ఒప్పుకుంటాడు. తీరా చూస్తే పాలివ్వదు.

అందువల్ల వ్యవస్థే వాళ్లను చెడగొడుతోందని పెద్ద లెక్చర్లేమీ యివ్వకుండానే చెప్తాడు నామిని. బ్యాంకులోను అంటే ఇంకో కథ గుర్తుకు వచ్చింది. 'మా కమలత్త కూర తెచ్చిందహో' అని. కమలత్త అని ఓ పరమపీనాసి. జబ్బు తగిలిన కోడిపిల్లలను అందరూ బయట పడేస్తే, ఆమె అవి పట్టుకెళ్లి కూర వండుకునేదిట. అటువంటామె ఓ రోజు కోడి కూర కొంటుంది. ఏమిటి విశేషం? అని అడుగుతాడు నామిని.

'బ్యాంకులోన్లు మాఫీ చేస్తున్నారని పేపర్లో వచ్చిందని చెప్పావు గదా. నేను ఐటీడీలో తీసుకున్న పదివేల రూపాయల లోను కట్టక్కర్లేదు గదాని పండగ జేసుకుంటున్నా' అంటుందామె. లోను ఎగ్గొట్టడమంటే ఎంత సంతోషమో చూడండి.

పాపం జుట్టుబావ కథలో గవర్నమెంటు ప్లాన్లు నమ్మి చెడిపోయిన రైతు కనబడతాడు. తెలుగుగంగ వస్తోంది, నగరి కాలువ వస్తోందని చెప్పి ప్రచారం జరుగుతుంది. ఎన్టీయార్ ప్రారంభోత్సవం చేశాక



నిర్వాసితుల సమస్య ఇప్పుడు జోరుగా నడుస్తోంది కదా. ఈ ప్రాజెక్టులమీద ఆశలు ఇలాటి బడుగు జీవుల జీవితాలకు ఎంత ఉపద్రవం తెచ్చిపెడతాయో కథగా చెప్పాడు నామిని.

ప్రభుత్వ పథకాల పేర గ్రామీణప్రాంతంలో జరిగే మోసాలు కూడా నామినికి కథా వస్తువులయ్యాయి.

నామిని అన్న కూతురు ఆదిలక్ష్మి పదోతరగతి చదివి వుంటుంది. ఊళ్లో నైట్ స్కూల్‌కి ఇన్‌ఛార్జి అవుతుంది. నెలకు నూట ముప్ఫయి రూపాయిలు జీతం. కానీ రైతులు పగలెల్లా పనిచేశాక రాత్రి స్కూల్లో చదవమంటే చదువుతారా? అందువల్ల పిలిచి పీటేసినా వాళ్లు రారు. ఈ అమ్మాయికీ పని లేదు. హేపీగా వుంటుంది. కానీ అప్పుడప్పుడు సూపర్‌వైజర్ వచ్చినపుడు మాత్రం కొంత హడావుడి చేయాలి.

ఓ సారి ఏ నోటీసు లేకుండా సూపర్‌వైజరు వస్తాడు. అప్పటికప్పుడు ఇరవై మంది వయోజనులు కావాలి. ఆదిలక్ష్మి ఉద్యోగం కాపాడడానికి చదువుకున్నవాళ్లే - నామినితో సహా - చదువురానట్టుగా యాక్షను చేస్తూ రాత్రి 8 గంటలకు స్కూలికి వెళతారు. సూపర్‌వైజర్ 'మీరంతా మీ పేర్లను పలకలో రాసి చూపించండి' అంటాడు. వీళ్లు కావాలని వొత్తులూ అవీ వదిలేసి, అక్షరాలు వక్రంగా రాసి చూపిస్తారు.

ఇంతలో ఆదిలక్ష్మి సూపర్‌వైజర్ కోసం కోడి వండుతూంటుంది. తనకు వచ్చే 130 రూపాయల్లోనూ సూపర్‌వైజర్ 60 రూపాయలు లాక్కుంటాడనీ, తక్కిన దాన్లో కూడా యిలా కోళ్లకు ఖర్చు పెట్టేస్తే మిగిలేదేమీ వుండదని గోల పెడుతుంది. అప్పుడు నామిని పలకమీద పెద్ద పెద్ద లెక్కలు వేసి సూపర్‌వైజరు వద్దకు వెళ్లి 'చూడబ్బా, ఆదిలక్ష్మి నాకు ఎంత చదువు చెప్పిందో! దయచేసి నెలనెలా అరవై తీసుకోవద్దు' అంటాడు.

ఆ సూపర్‌వైజర్ బిత్తరపోయి ఇతను కొత్తగా వచ్చిన వాళ్ల పెద్ద ఆఫీసరయి వుంటాడని కంగారు పడి 'సార్, ఆ అరవైలో నలభై మీకు వస్తుంది కదా, తక్కినది డైరక్టరుకి. నాకు దక్కేది కోడికూరే కదా!' అంటాడు. ప్రభుత్వ పథకాలు ఆచరణలో ఎలా అఘోరిస్తాయో హాస్యస్ఫోరకంగానే విమర్శిస్తాడు నామిని.

లోకంలో మనం ఒకళ్ల గురించి మరొకరు వాళ్లు లేనప్పుడు మాట్లాడుకుంటాం. ఆ తీరు గురించి చెప్పే కథ ఒకటి వుంది.

ఈ కథల్లో నామిని ఆదారి వాడిలా అనిపిస్తాడు. ఎమ్మెస్సీ చదివి ఆంధ్రజ్యోతిలో సబ్ ఎడిటర్ ఉద్యోగం చేస్తున్నా ఆడవాళ్లతో కూర్చుని జోకులేసుకుంటూ, కథలు చెప్పుకుంటూ, సరసాలాడుతూ వుంటాడు. హీ ఈజ్ కంఫర్టబుల్ ఇన్ దెయిర్ కంపెనీ. వాళ్లావిడ తిడుతూన్నా ఓ చెట్టుకింద ఆడాళ్లతో కూచుని హస్కు కొడుతూంటాడు.

ఆడాళ్లందరూ కబుర్లు చెపుతూంటారు. అంతలో నీలావతిని వాళ్ల అమ్మ 'చింతపండు కొట్టుకుందాం రా' అని పిలుస్తుంది. ఆమె వెళ్లంగానే బక్కత్త అనే ఆమె 'ఈ నీలావతిదీ ఓ బతుకేనా?' అంటూ ఆమె

చెప్పుకు పోతూ వుంటుంది. వీళ్లందరికీ నామిని తాళం వేసన్నా ఎగదోసన్నా వుంటాడు.

ఇంతలో నామిని భార్య అతన్ని పిలుస్తుంది. 'ఆడాళ్లతో కబుర్లేమిటి? ఇంటికి రాక?' అని తిడుతుంది.

ఇతను వెళ్లడానికి రిఫ్యూజ్ చేస్తాడు. దానికి కారణం చెప్తాడు కూడా - 'ఇప్పటిదాకా ఎవరు ఇక్కడ లేకపోతే వాళ్ల గురించి కథలు చెప్పుకుంటున్నాం. ఇప్పుడు నేను వెళ్లిపోయాననుకో. 'పెళ్లాం మాట వినేవాడు వీడూ మొగాడేనా?' అని నా మీద కథ చెప్తారు. అందువల్ల ఇక్కణ్నుంచి కదలను.' అని.




ఫక్కున నవ్వొస్తుంది కానీ లోకరీతి ఇంతే కదా అనిపిస్తుంది. ఈ కథ పేరు 'కుచ్చుంటే కత - లేస్తే కత'! ఈ కథ బాపుగారికి ఎంతో బాగా నచ్చింది. ఉత్తరం రాసి నామినిగార్ని అభినందించారు.

అన్నీ వంకరగా, వ్యంజనంతో చెప్పే కథలే కాదు. కొన్ని నీతి కథలు వున్నాయి. ఓ కథలో ఇల్లరికపు అల్లుణ్ని యింట్లో పెట్టుకున్నామె ఘోష చెప్తాడు రచయిత. ఆ అల్లుడు పెద్దగా పనిచేయడు, అతని భార్య, అంటే ఈమె కూతురు మొగుణ్ని వెనకేసుకుని వస్తూ వుంటుంది. ఈమె అది చూసి ఖేదపడుతుంది - 'మొగుడింట్లో కొస్తానే గిన్నెత్తుకోని వాడికి అన్నం బెట్టేది నేర్చుకుంటే చాలదు ఆడది! మొగోణ్ణి నసబెట్టి పనికి ఎగదోలేది ఆడది - నిజ్జమైన ఆడది!' అని కూతురుకి హితవు చెప్తుంది.

పొట్టవ్వ అనే ఒక తొంభై యేళ్ల ముసలావిడ కసువు తవ్వుతూంటే రచయిత వెళ్లి ఆమెను అడుగుతాడు - 'నీకేం కర్మం ఇది?' అని. 'కర్మం కాదురా, అందరూ పని చేస్తూ వుంటే చూసి ఆడది - ఎంత ముసల్దయినా సరే - గమ్మున కాళ్లు చాపి కూచోలేదురా' అంటుంది ఆమె.

కష్టపడి సంపాదించేవాళ్లు శుబ్బరంగా తినాలి అనే సందేశం యిస్తాడు 'పెరుగుసాయెబు' కథలో. నామిని, వాళ్ల అమ్మా పెరుగు అమ్మబోతారు. ఓ సాయిబు పెళ్లానికి తెలియకుండా నాలుగు లోటాలు తాగుతాడు. 'ఈ పెరుగంతా ఇంట్లో పెట్టుకుంటే నీకూ నీ పెళ్లాం బిడ్డలకూ సరిపోయేదిగా' అని నామిని అమ్మ అతన్ని తిడుతుంది.

'చాల్లే, నా పెళ్లాం తను తినదు, ఇంకోళ్లను తిననివ్వదు. సున్నం గుల్ల కొట్టి కొట్టి వొళ్లు ఉడుకు చేసింది.' అంటూ వాపోతాడు సాయిబు.

అలాగే ఇంకో కథలో సుబ్బి అనే పాత్ర నలుగురి మనుష్యుల పని చేస్తుంది. నలుగురి తిండి తింటుంది. 'బండెడు కష్టం జేసి బానడు సంగటి తింటే తప్పా సామీ!' అని మొగుణ్ని దీనంగా అడిగితే 'అయ్యో, నిజమే కదా' అనిపిస్తుంది.

ఆడవాళ్ల ఆలోచనా విధానం మీద కథలున్నాయి. ఓ పేద అమ్మాయిని ఓ పెద్దింటి కుర్రాడు పెళ్లి చేసుకుంటానంటాడు. ఈమె వద్దంటుంది. ఇంట్లో తల్లి తిట్టిపోస్తుంది. నామిని వెళ్లి బుద్ధి చెప్పబోతే ఆమె అంటుంది - 'అతను కష్టజీవి కాదు. సేద్యం చెయ్యడు' అని. 'ఈరోజుల్లో సేద్యం ఎవరు




అలాగే ఒక తల్లి అందమైన తన కూతురికి ఉద్యోగస్తుణ్ని యిచ్చి పెళ్లి చేద్దామని చూస్తుంది. వాళ్లందరూ కట్నాలు అడిగేవాళ్లే! ఈమెకు విసుగెత్తిపోతుంది. 'ప్రతీవాడూ కట్నం అడిగేవాడే! మా అమ్మాయి అందాన్ని ఆరా తీరా చూసి 'అమ్మాయినివ్వండి చాలు' అనేవాడు లేడే! ఈ నపుంసకులు అల్లుళ్లుగా వుండేమి సుఖం? లేకేమి కష్టం? ' అని తిట్టిపోస్తుంది.

అలాగే కంసాలోళ్ల శివమ్మ కూతురు అనే ఓ పాత్ర. ఆమె మొగుడు కొలిమి ముట్టించడు. పని చేయడు. పైగా పుట్టింటినుండీ ఇంకా పట్టుకురాలేదనీ, పిల్లలు పుట్టలేదనీ భార్యను తంతూ వుంటాడు. ఈమె చెప్తుంది - 'ఇంకో రెండేళ్లు చూస్తా. నా దోవకు వచ్చాడా సరి! లేకపోతే ఎక్కడ తన్నాలో అక్కడ తంతా!' అని ప్రతిజ్ఞ చేస్తుంది.

వీటిని ఫెమినిస్టు కథలని అనవచ్చో కూడదో నాకు తెలియదు. ఆ నిర్వచనాల గురించి నాకు చాలా కన్‌ఫ్యూజన్లు వున్నాయి. కానీ స్త్రీలను జాగృతం చేసే కథలని మాత్రం తప్పక చెప్పగలను.

నేను ముందులోనే చెప్పాను కదా, ఈ కథలను నామిని సుబ్రహ్మణ్యం నాయుడు చెప్పిన తీరు మాత్రం విలక్షణంగా వుంటుందని. తనను తాను వేళాకోళం చేసుకుంటూ, తన విషయాలు రాస్తూ కథలు చెప్పారు. ఓ కథలో రాస్తారు - తను భార్య కంటె జానెడు పొడుగు తక్కువ అని.

ఆ విషయం భార్య ఎద్దేవా చేస్తే ఆయన కళ్లలో నీళ్లెట్టుకుని అన్నాట్ట - 'నేను నీ యింటికి పెళ్లి చూపుల కొచ్చినప్పుడే - పెళ్లి కొడుక్కి కన్నొకటి మెల్లగా వుండాది, నడిచేది కూడ చేతగానట్టుండాది, వాడొట్టి ఆడరేకలోడుగా వుండాడు, వాణ్ని నేను చేస్కోనని పుల్లించి నేలేసేసుంటే - నాకు తగ్గదాన్నెవుర్నన్నా నేను చేస్కోనుండనా? పెండ్లయినాక నాకిన్ని సొట్టలు జెప్పడం నీకు దర్మమా ప్రబా?' అని అన్నాట్ట.

ఇలా ఏడిపించింది కాబట్టే అంకితం యిచ్చినపుడు కూడా 'మా యమ్మకూ, నాకూ, సరోజత్తకూ, ఒకరికనేమి ఈ కతల్లో వుండే వాళ్లందరికీ (ఒక్క నా పెళ్లానికి తప్ప!) - సినబ్బ' అని రాశారు. భలే నవ్వు వచ్చింది. ఈయనెవరో భలేవాడురా అనుకుని మెచ్చుకున్నాను.

ఇలా వుండగా 1998లో ఆయన ఆంధ్రజ్యోతి వీక్లీ ఎడిట్ చేయడానికి హైదరాబాదు వచ్చారు. నా కథలు అంతకుముందు చదివి వున్నారుట. 'మా వీక్లీ క్కూడా రాయండి' అంటూ రిక్వెస్టు చేస్తూ ఫోన్ చేశారు. నేను థ్రిల్లయిపోయాను. అంత పెద్ద రచయిత నాతో స్వయంగా మాట్లాడారే! అని. ఆ రోజే 'మిట్టూరోడి కతలు' పుస్తకం కాపీ పట్టుకెళ్లి ఆయనను కలవబోయాను.

నిజం చెప్పాలంటే ఆయన్ను చూడగానే తెల్లబోయాను. ఆయన కథల్లో తనను తాను వర్ణించుకున్నట్టే వున్నాడు. ఎంత వినయంగా వున్నాడంటే - నా పుస్తకం మీద ఆటోగ్రాఫ్ చేయమంటే ఓ పట్టాన ఒప్పుకోలేదు. 'నేను చిన్నోణ్ని. ఆటోగ్రాఫ్ చేస్తే ఇకారంగా వుంటది' అంటూ నస. మాట చిత్తూరు జిల్లా యాసే! ఎమ్మెస్సీ చదువుకున్నాయన అంత పల్లెటూరి యాస ఎలా నిలుపుకున్నాడో నా కర్థం

వచ్చి మన నాదస్వరం విని 'మీ సంగీతం మాకు చాలా యిష్టం' అని పట్టి పట్టి తెలుగులో మాట్లాడితే పొంగిపోయే రకం.


ఇలాటి కథలు రాయడానికి చాలా మేధావితనం కావాలి. ఆ మేధావి తనను తాను అజ్ఞానిగా, అమాయకుడిగా అక్షరాల్లో చూపుకోవచ్చు కానీ బయటకూడా అలాగే కనబడడం నాకు జీర్ణం కాలేదు. ఆయన సూటు, బూటులో కనబడి 'యు నో హౌ ఐ కన్సీవ్డ్ ది హోల్ బ్యాక్‌డ్రాప్ ఆఫ్ ది కారెక్టర్' లాటి స్టేటుమెంటు  యిచ్చి వుంటే నోరు వెళ్లబెట్టుకుని వినేవాణ్నేమో!

మొదటిసారి కలిసినపుడు నాకు కావాలని జర్క్ యిద్దామని నామిని వేసిన వేషం కాదిది. తర్వాతకూడా ఆయన అలాగే వున్నాడు. 'నా కేమీ తెలియదండి. నేను పెద్దగా ఇంగ్లీషు పుస్తకాలూ అవీ చదవలేదు' అని నొక్కి చెప్పేవాడు. ఆ కథలు అంత సింపుల్‌గా రాయాలంటే ఎంతో చదువుకుని వుండాలనే నా నమ్మకం యిప్పటికీ పోలేదు.

పివి నరసింహారావుగారు 'ది ఇన్‌సైడర్' అనే పుస్తకం రాశారు. అది ఆత్మకథో, వొట్టి ఫిక్షనో ఎవరూ తేల్చలేకపోయారు. కొంత యిదీ, కొంత అదీ అన్నాడాయన. ఏది ఎంతో ఎలా తెలుస్తుంది? నామిని వ్యవహారం చూస్తే ఈ కథలన్నీ అక్షర సత్యాలనీ, కోపం వచ్చినపుడు వాళ్లావిడ ఈయన వీపు వొంచి ఓ రెండు గుద్దులు గుద్దుతుందనీ నమ్మాల్సి వుంటుంది.

పుష్కరం కింద ఆయన కథల్లో రాశాడు – 'నన్ను ఐదరాబాదులో వుండమంటే వుండను. మన ఊరు తిరిగి వచ్చేస్తానని.' నిజంగానే ఆంధ్రజ్యోతి మూసేసినప్పుడు చిత్తూరు జిల్లా వెళ్లిపోయారు. ఆంధ్రజ్యోతి తిరిగి తెరిచినప్పుడు అందులో జేరలేదు. 'చిన్నపిల్లలకు లెక్కలు చెప్పడం ఎలా?' అన్న పుస్తకాన్ని లక్షల్లో ప్రింటు చేయించి, ఊరూరా తిరిగి పుస్తకాలు అమ్ముతూ విద్యావ్యాప్తి చేస్తున్నారు ప్రస్తుతం. కథలే కాదు, నామిని కూడా విలక్షణమైన, ప్రత్యేకమైన మనిషే!

✦



# దర్గామిట్ట కథలు

ఇప్పటివరకు 'మిట్టూరోడి కతలు' గురించి చెప్పుకున్నాం కదూ, ఈ కథలకీ యికపై చెప్పుకుంటున్న 'దర్గామిట్ట కతలు'కు లింకుంది. అవి రాసిన నామిని మార్గదర్శకత్వంలోనే ఖదీర్‌బాబు ఈ కథలు రాశారు. వాళ్లిద్దరూ ఆంధ్రజ్యోతిలో కొలీగ్స్. నామిని ఆంధ్రజ్యోతి వీక్లీకి ఎడిటరుగా హైదరాబాదు వచ్చేసరికే ఖదీర్‌బాబు ఆంధ్రజ్యోతి ఆదివారం సెక్షన్‌లో పనిచేస్తూండేవాడు. పక్కపక్క సెక్షన్లు. నామిని అప్పటికే అయిదారేళ్ల క్రితమే, మిట్టూరోడి కతలు రాసి లబ్ధప్రతిష్ఠుడయ్యాడు. ఆ తరహా కథలు రాయడానికి ఖదీర్‌బాబే సరైన వ్యక్తి అని ఆయన అతి త్వరగా గుర్తించాడు.

ఏవేవో కథలు రాసేబదులు ప్రతివాడూ వాళ్ల అమ్మగురించి, వాళ్ల నాయన గురించి, బాల్యం గురించి రాయాలనీ, అలా రాసినప్పుడే మనకు తెలియని జీవితాలు బయటపడతాయనీ, వాటిల్లో బ్యూటీ అందరికీ తెలుస్తుందనీ ఖదీర్‌కి నామిని హితబోధ చేశాడు. ఖదీర్‌కి ఆ పాయింటు నచ్చింది. తన బాల్యం గురించి వరుసగా చెప్పుకుపోయాడు. నామిని లాగానే - తనెరిగిన మాండలీకం లోనే, దాపరికం లేకుండా, కథలు కథలుగా, కథలో ట్విస్టు గురించి పాకులాడకుండా - చెప్తూ పోయాడు.

దానివల్ల జరిగిన మేలేమిటంటే అనేకానేక సజీవ పాత్రలు సాహిత్యంలోకి ప్రవేశించాయి. జాగీర్దార్ కుటుంబంలో పుట్టి ఎలక్ట్రీషియన్ అయిన వాళ్ల నాన్న, అబద్ధాలు చెప్పయినా సరే యింట్లోంచి ఆడపిల్లలకు పెళ్లి చేసి పంపించాలని చూసే అత్తా, నెలంతా ఉపవాసాలుంటే పిల్లవాడికి పుణ్యం మాట ఎలా వున్నా, సత్తువ రాదేమోనని తల్లడిల్లే తల్లి, పంది తాకితే భ్రష్టుడయిపోయి నరకానికి పోతానని బెదిరిపోయే కుర్రాడు, రిజర్వేషన్ వస్తుందేమోనని తక్కువ కులంగా చూపించుకుందామని చూసే కులీసులు - యిలా అందరూ జీవితాల్లోంచి పుస్తకాల్లోకి ఎక్కారు. మనకు ఆనందం లేదా అబ్బురం కలిగించాలని వీళ్లు అతిశయంగా అభినయించరు. వాళ్ల వాళ్ల జీవితాలను ఖదీర్‌బాబు అక్షరాల కెక్కిస్తూంటే మౌనంగా పరికిస్తారు.



మిట్టూరోడి కతలు గురించి చెప్పినపుడు తల్లిమనసు గురించి చెప్పిన కథతో మొదలెట్టాను. ఇక్కడ కూడా నాకు బాగా నచ్చిన కథతో మొదలెడతాను - ఖదీర్ వాళ్లమ్మ రోజా చేయడం గురించిన కథ అది. రోజా అంటే రంజాన్ మాసంలో ఉండే ఉపవాసాలు, ఒక్కపొద్దులు. ఖదీర్ నాన్న, నాయనమ్మ ప్రతీ యేడాదీ రోజా వుంటారు. బోల్డంత పుణ్యం సంపాదించుకుంటూ వుంటారు. ఈమెకి మాత్రం ఆ చింత వున్నట్టు ఎక్కడా తోచదు. ప్రతిసారీ ఏదో ఒక కారణం చెప్పి ఎగ్గొడుతుంది. తనే కాదు, పదమూడు యేళ్ల పెద్దకొడుకు రోజా

తిండికి తోడు పిల్లాడి చేత రోజాలు కూడా పెట్టిస్తే యిక బిడ్డ చేతికందేనా?' అని ఆమె చింత.



ఖదీర్ వాళ్ల నాన్న కరీంభాయ్ ఆ వాదనకు ఒప్పుకున్నాడు కానీ భార్య కూడా ప్రతీ ఏడాదీ ఎగ్గొట్టడం అతనికి నచ్చలేదు. ఉడికించినంత సేపు ఉడికించి, రాత్రి 'సరే వాడి మాట వదిలిపెట్టు గానీ, ఈ సారి నువ్వుండు' అన్నాడు.

ఇక ఆమె బ్రేక్ అయింది - 'నన్ను వదిలిపెట్టు సామీ. నువ్వు డబ్బు తెచ్చి యిస్తే యిస్తావు. లేకపోతే లేవనేస్తావు. నేనే కదా వాళ్ల దగ్గిరా, వీళ్ల దగ్గిరా చేయిచాచి, అబద్ధాలు చెప్పి యింత ఉడకేసి పడేయాల్సింది. మీ అమ్మ ఘరానా వంశస్తురాలు. ఎవర్నీ అడగదు. కానీ నేను - ఇరుగింట్లోంచి నూనె కొట్టుకొస్తాను. పొరుగింట్లోంచి, వాళ్లు చూడకుండా బియ్యం ఎత్తుకొస్తాను. ఇంటాయన చూడకుండా, యివిగో యీ మామిడికాయలు దొబ్బుకొచ్చి పచ్చడి చేసి పిల్లలకు పెడతాను. ఉపవాసాలు చేస్తూ పవిత్రంగా వుండవలసిన రోజుల్లో ఈ పనులు చేయకుండా వుండలేను. చేసి మరింత పాపం మూట గట్టుకోలేను. నువ్వూ మీ అమ్మా ఆ ఉపవాసాలు చేసి పుణ్యం మూటగట్టుకోండి. నేను నా పాపం నింపుకుంటా' అంటుంది.

కథ పేరు - "పాపాలన్నీ మా యమ్మకేనంట". చదివితే కళ్లంట నీళ్లు నిలుస్తాయి.

ఈ కథలకు క్షేత్రం కావలి. నెల్లూరు జిల్లాలో వుంది. ఖదీర్ కుటుంబం ఆ వూళ్లో కసాబ్‌గల్లీ అనే ఓ వీధిలో అద్దెకు వుంటూండేది. కొంతకాలం పోయాక పాతూరు అనే కావలి శివారుకి మారిపోయారు. అక్కడ స్వంత యిల్లు కట్టుకున్నారు. దర్గామిట్ట అనేది ఏమిటంటే నెల్లూరుకి దక్షిణం వైపు ఓ చెరువు నానుకుని ఉండే ఓ మిట్ట. అక్కడ ఓ ముస్లిం గురువు సమాధి వుంది. ముస్లిములు, హిందువులూ అక్కడకి వచ్చి కోరికలు కోరుకోవడం కద్దు. ఆ ప్రాంతం పేరే ఈ పుస్తకానికి ముకుటంగా నిలిచింది.

పుస్తకం పేరులో హిందూ కనక్షన్ వున్నట్టే ఖదీర్‌బాబు పేరులో కూడా హిందువుల్లో పెట్టుకునే 'బాబు' పేరు వుంది. అదెలా వచ్చిందో సరదాగా చెప్పుకువచ్చాడు రచయిత. - ఖదీర్ ఆ దంపతులకు రెండో కొడుకు. పేరు ఏం పెట్టాలో తేలక తాత్సారం జరుగుతోంది. ఓ శుక్రవారం నాడు, మంచిరోజు కదాని తండ్రి కలకండ యింత తెచ్చిపెట్టి నాయనమ్మతో 'అమ్మా, మంచి పేరేదైనా చూడు. నేను సాయంత్రం వచ్చాక ఖరారు చేసేసి కలకండ పంచేద్దాం' అని చెప్పి వెళ్లాడు. వెళ్లినవాడు రాత్రి ఏడయినా రాలేదు. శుక్రవారం ఘడియలు వెళ్లిపోతాయని నాయనమ్మ ఖంగారు పడసాగింది. ఏదో ఒకటి తనే పెట్టేద్దామనుకుంది.

'ఇది కాకపోతే మరో మంచిరోజు వస్తుంది కానీ ఆయన రాకుండా ఏదీ ఖరారు చేయకు' అని కోడలు - అంటే ఖదీర్ తల్లి - మొత్తుకుంటున్నా వినకుండా ఖురాన్ తెరిచి చూసి అల్లాకు వున్న తొంభై తొమ్మిది పేర్లలో ఒకటైన 'ఖదీర్' (అంటే సమర్థుడు) అని పెట్టేసింది. పెట్టేసి ఇంటి పక్క కుర్రాణ్ని పిలిచి 'మా మనవడికి 'మహమ్మద్ ఖదీర్ అహమద్' అని పేరు పెట్టామని పదిమందికీ చెప్పి ఈ కలకండ పంచేయ్' అని పురమాయించేసింది.



'అరిచచ్చిన్నాయన' అనేవారట. హీరో తను పెట్టిన హోటల్‌కు వాళ్ల నాన్న పేరు పెడదామనుకుని ఈ విషయం గుర్తుకువచ్చి, అది మానేసి, తన పేరే పెట్టుకుంటాడు.

అలాగే 'ఖదీర్' పదంలోని 'ఖ' అనే అక్షరం! తెలుగులో అది ఖ కాదు, క కాదు. గొంతులో నీళ్లుపోసుకుని గరగర లాడిస్తామే అలా ఖ అని పలకాలి. అలా పలకడం సరిగ్గా రాక ఏదో ఒక నిక్‌నేమ్ పెట్టేస్తారని ఖదీర్ తండ్రి భయం. ఆయన అసలు పేరు దస్తగిరి అహమద్. యింట్లో పేరు కరీముల్లా. ఇవన్నీ నోరు తిరక్క అందరూ ఏదో ఏదోలా పిలుస్తూంటే కరీం అని మార్చేసుకున్నాడు. వాళ్ల ఆడాళ్లలో ఎంత పొయెటిక్‌గా పేర్లు పెట్టినా అవన్నీ పలకలేక హిందువులు సింపుల్‌గా అందర్నీ కట్టకట్టి 'బూబమ్మ' అనేస్తారని ఆయన బాధ. అలాటి అభిప్రాయాలున్న పెద్దమనిషి కొడుక్కి తల్లి నోరు తిరగని పేరు పెట్టిందని కోపం తెచ్చుకోడా?

ఖదీర్ అన్న పేరు వినగానే అతని తండ్రి శివాలు తొక్కి 'హిందువులు యిప్పటికే మన పేర్లు పలకలేక ఛస్తున్నారు. వాళ్లకు నోరు తిరిగే పేరు పెడితే నీ సొమ్మేం పోతుంది?' అని తన తల్లిని మూడురోజులు సతాయించి, ఇంకేం చేయలేక ఊరుకున్నాడు. కానీ ఆ మాట మీసాల సుబ్బరాజుగారు అడగనే అడిగారు. మీసాల సుబ్బరాజు గారు విద్యానికేతన్ స్కూలు కరస్పాండెంట్. ఖదీర్‌ని స్కూల్లో చేర్చడానికి వచ్చినపుడు 'ఇదేంటయ్యా, యిలాంటి పేర్లన్నీ మా నోళ్లు తిరిగేదానికేనా?' అన్నారు. 'ఏం చేద్దాం చెప్పు' అన్నాడు ఖదీర్ తండ్రి.

'చివర్లో అహ్మదు తీసేసి బాబు అని పెడదాం. తక్కినవేవీ నోరు తిరక్కపోయినా బాబూ అనైనా పిలుస్తారు కదా' అన్నాడు సుబ్బరాజుగారు. ఓకే అన్నాడీయన.

ఈ ఏర్పాటు వల్ల సుఖపడ్డానంటాడు ఖదీర్. తన పేరును 'ఖాదర్' అనీ, 'ఖాదీర్' అనీ, 'కాదిర్' అనీ, 'కదిరి' అని – మీకు తెలిసే వుంటుంది కదిరి అనేది ఊరిపేరు – అని రకరకాలుగా పిల్చినవాళ్లున్నా 'బాబు' మాత్రం అందరూ కరక్టుగానే పిలిచారుట!

ఈ మధ్య ఐఐటీ చుక్కా రామయ్యగారు ఇంటి భాషనే స్కూళ్లలో కూడా పెట్టాలని ఉద్యమిస్తున్నారు. మన యింట్లో భాష మెజారిటీ పిల్లలు మాట్లాడే భాష అయ్యుండాలని లేదు కదా! అలాటప్పుడు చిక్కులు వచ్చి తీరతాయి. ఉదాహరణకి ఓ కుర్రాడి కుటుంబం విజయనగరం నుంచి హైదరాబాదుకి తరలి వచ్చిందనుకుందాం. వాళ్ల యింట్లో మాట్లాడుకునే 'వెళిపొచ్చింది', 'వచ్చీసినాది' లాటి మాటలు స్కూల్లో మాట్లాడితే అందరూ ఆట పట్టించడం ఖాయం. అలాగే ఓ హైదరాబాదు కుర్రాడు నెల్లూరుకి ట్రాన్స్‌ఫరై వెళ్లి 'వచ్చేసిందు' అన్నాడంటే ఆ పిల్లలందరూ గొల్లుమనడం నిశ్చయం.

అరవ బ్రాహ్మల్లో కొన్ని ప్రత్యేకమైన మాటలున్నాయి. అందరూ యింటిని 'వీడు' అంటే వాళ్లు 'అగం' అంటారు. అలాక్కనక స్కూల్లో మాట్లాడితే తక్కిన కుర్రాళ్లు వేరుగా చూస్తారుకదా! ఖదీర్‌కీ ఇలాటి సమస్య వచ్చింది. వాళ్ల యిళ్లల్లో మాట్లాడే భాష ఆ ప్రాంతాలకు పరిమితమైన ఉర్దూ. నిజానికి తమిళనాడు, కేరళలలో ముస్లిములు ప్రాంతీయ భాషే మాట్లాడుతారు. కానీ కర్ణాటక నవాబు, ఆర్కాటు

సారి వాళ్ల టీచరుతో 'పురికోస విరక్కొట్టేదా టీచర్' అన్నాడు. అప్పణ్నుంచి ఆవిడకి ఇతని తెలుగుభాషంటే నవ్వు. స్కూలు యానివర్సరీకి డ్రామాలు వేయడానికి ఇతను సిద్ధమయితే ఆవిడ తిట్టిపోసింది – 'నీకు తెలుగేమి వచ్చురా నాకీ నీకీ అనుకుంటూ. స్కూలుకే రావు గానీ డ్రామాకు మాత్రం సిద్ధమయ్యావు' అని తిట్టి కూచోబెట్టింది. ఖదీర్‌కి పట్టుదల వచ్చింది. గబ్బర్ సింగ్ డైలాగులు చెప్పి స్టేజంతా కుమ్మేసాడు. అతని మీద గౌరవం పెరిగి స్కూల్లో రోజూ ప్రార్థన చేసే ఆడపిల్లలు రాని రోజున యికపై ఇతనికే ఆ ఛాన్సు దక్కేది. అ విధంగా అతని చిరకాల వాంఛ తీరింది.



ఇంతకీ చెప్పడం మర్చిపోయాను – అది వినాయకుడిమీద ప్రార్థన!


ఆర్కాటు నవాబులే కాదు, రాయలసీమలో కూడా చాలామంది నవాబులు వుండేవారు. బనగానపల్లి నవాబు, ఆదోని నవాబు.. యిలా. వీళ్ల పేషీల్లో ముస్లిములే మున్షీలు. ఉద్యోగాలు, హోదాలు ఉండేవి. ఆస్తులూ బాగానే సంపాదించుకున్నారు. వాటితో బాటూ ఖర్చులూ పెంచుకున్నారు. జల్సా చేసేవారు. ఇంగ్లీషువాళ్లు వచ్చాక నవాబులు పోయారు. ఇంగ్లీషుకి ప్రాబల్యం పెరిగింది. ఇంగ్లీషు నేర్చుకోవడంలో ముస్లిములు వెనకబడ్డారు. హిందువుల ప్రాముఖ్యత పెరిగింది. ఓ పక్క ఆస్తులు కరిగిపోతున్నా ముస్లిములు మారలేదు. ఖర్చులు పెంచుకుంటూ పోయారు కానీ చదువులమీద శ్రద్ధ పెట్టలేదు. క్రమక్రమంగా దిగజారిపోయారు. చివరికి ముస్లిం జాతి అంటే 'ఖానా, పీనా, సోనా'గా తయారయిపోయింది. చదువు ఎప్పుడైతే లేదో పాత ఆచారాలను పట్టుకుని వదలకపోవడం జరిగింది. 'దర్గామిట్ట కతలు'లో వాటి ప్రస్తావన, పర్యవసానాలు సరదా సరదాగానే చెప్పడం జరిగింది.

అవన్నీ చెప్పేందుకు ముందు ఉర్దూ పాఠాల గురించి చెప్పాలి. పైన చెప్పిన కచ్చేరీ కార్యకలాపాల వల్ల తమ పిల్లలు ఉర్దూ నేర్చుకోవాలని ముస్లిములు అభిలషించడం జరిగింది. నిజానికి భాషకి, మతానికి ఏ సంబంధమూ లేదు. ఏ మతం వాళ్లయినా ఏ భాషైనా మాట్లాడవచ్చు. కానీ సంస్కృతానికీ, హిందూమతానికి ఎఫినిటీ వున్నట్లే, ఉర్దూకీ, భారతీయ ముస్లింకు అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది.

ఉర్దూ నేర్చుకోవడం గురించి కూడా ఓ కథ వుంది. ఖదీర్ నాయనమ్మ చిన్నపిల్లలకు ఉర్దూ చెప్పేదానికి పూనుకుంది. మనుమలకే కాదు, ఇంటిపక్క షమ్మీకి కూడా చెప్పి వాళ్లను ఉద్ధరిద్దామనుకుంది. ఉర్దూ రాకపోతే అత్తారింట్లో మొహం మీద ఊస్తారని హడలగొట్టి వాళ్ల తలిదండ్రులను బెల్లించి స్టూడెంట్స్‌ను పోగేసింది. అందరిచేతా అలీఫ్, బే, తే..లు రాయించేది. అంటే అ, ఆ, ఇ, ఈ లాటివన్నమాట. తొడపాశాలు తిని తిని, ఆ షమ్మీకి వీళ్ల బామ్మమీద పాటలు కట్టే నేర్పు అబ్బింది. 'అలీఫ్, బే తే.. మీ నాయనమ్మకు గోరీ కడితే..తే' అని పాడేది. ఖదీర్ మాత్రం తీసిపోయేవాడా? 'అలీఫ్ బే తే.. హమారీ దాదీకీ కబర్ బే తే' అని. కబర్ అంటే సమాధి.

కొన్నాళ్లకి స్కూల్లో ఇంగ్లీషు, తెలుగుబాధ, ఇంట్లో ఉర్దూ బాధ. అది తప్పించుకోవడానికి వీళ్ల వీధి కుర్రాళ్లందరూ కలిసి ఓ ఈవెనింగ్ ట్యుటోరియల్స్‌లో చేరిపోయారు. ఆ విధంగా ఉర్దూ పీడ





ఇందాకా చెప్పాను కదా, ముస్లిములు క్రమంగా ఆస్తులు పోగొట్టుకుని స్థాయి దిగజార్చుకుంటూ వచ్చారని. ఖదీర్ వాళ్ల నాన్న కరీంభాయి కూడా అలాటి వాడే. కరీంభాయ్ తండ్రికి పదిహేనెకరాల సరుగుడు తోట, ఆరెకరాల పొలం, చేపల వ్యాపారం వుండేవి. లాట్‌సాహెబ్‌లా బతికేవాడు.

ఆయన పెద్దల్లుడుది మరీ దర్జాపద్దు. పెళ్లిలో ఎనభై సవర్ల బంగారాన్ని బుట్టలో పెట్టి యిస్తే 'నేనంత లెవెల్ తక్కువోణ్నా' అని బుట్ట తన్ని పారేసిన పెద్దమనిషి. ఆయన గానాబజానా ఆడవాళ్ల పిచ్చిలో ఆస్తులన్నీ కరగబెట్టుకున్నాడు. అదేమిటని ఎదిరించిన పెళ్లాన్ని పుట్టింటికి తన్ని తగిలేశాడు. దాంతో అక్కా బావల దగ్గిరే వుండి చదువుకుంటున్న కరీంభాయ్ చదువు అటకెక్కింది. తండ్రి చులకనగా చూసేవాడట. ఓ రోజు ఓ మాటకు కోపం వచ్చి ఈ కరీం భాయ్ 'నీ ఆస్తి నాకక్కరలేదు' అని యింట్లోంచి పారిపోయాడు. వెళ్లి కరంటు పని నేర్చుకుని నాలుగు డబ్బులు సంపాదించుకుని ఏడు నెలల తర్వాత సొంతూరు వెళ్లాడు. వెళ్లాడే కానీ తండ్రి ఆస్తి ముట్టుకోలేదు.

ఖదీర్ తండ్రి కరంటు వ్యాపారంలో నిలదొక్కుకోవడానికి కారణం రవి అనే కాంట్రాక్టరు. అతనంటే కరీంభాయ్‌కు ప్రాణం. రంజాన్ పండగనాడు ఆ రవికీ, పలావ్ వెంకారెడ్డికీ పలావు చేయించి తీసుకెళ్లకపోతే కాలు నిలవదు ఇతనికి. ఇంట్లో వాళ్లు మాడినా ఫర్వాలేదు, 'పండగంటే మనం తినడానికి కాదు' అని అతని నమ్మకం.

పలావ్ వెంకారెడ్డి అంటే కరీంభాయ్‌కు చాలా యిష్టం. పెళ్లి టైములో ఇతను బుద్ధిమంతుడని మావగారికి చెప్పినది ఈయనే! ఖదీర్‌బాబు తల్లిని అమ్మాయ్ అంటూ పిలిచే చనువున్నది ఈయనకే! కరీంభాయ్‌లాగే కాస్త సత్తెకాలపు మనిషి. రకరకాల వ్యాపారాలు చేసి, దెబ్బతిని చివరకు పలావు సెంటరు పెట్టి నిలదొక్కుకున్నాడు. అప్పట్నించీ ఆయన యింటి పేరు అదే అయిపోయింది.


రంజాన్ నెలలో పిల్లలకు బట్టలు కొనాలి. కానీ కరీంభాయ్ దగ్గిర డబ్బుల్లేవు. భార్య ఎంత చెప్పినా కదల్లేదు, మెదల్లేదు. చివరకి తల్లి అక్షింతలు వేసింది – 'రే అబయా, ఏందిరా నువ్వా నీ బేడంగీ పనులూ. మనకు లాకపోయినా పిలకాయలకన్నా నాలుగు గుడ్డముక్కలు తేకపోతే ఎట్టా. వీదిలో కొత్త గుడ్డలేసుకున్న పిలకాయలను చూసి మన పిలకాయలు మనసు కష్టపెట్టుకోరా' అని. 'సరే, సాయంత్రం పిల్లల్ని కొట్టుకి పంపండి. బట్టలు తీసిస్తాను' అన్నాడు. అన్నాడే కానీ సాయంత్రం వీళ్లెళ్లేసరికి డబ్బులు జతపడలేదు. రేపు చూద్దాంలే అన్నాడు. పిల్లలు ఉసూరుమన్నారు. ఆ టైములో వెంకారెడ్డి ఎక్కణ్నుంచో వచ్చాడు. అప్పట్లో ఆయనకు బస్టాండ్ దగ్గిర బట్టలకొట్టు వుండేది. సంగతి విని 'రండి, డబ్బులొచ్చినాక యిద్దువులే' అంటూ షాపుకి తీసుకెళ్లి అందరికీ దిట్టంగా వుండే బ్లూ కలర్ గుడ్డ తీయించాడు. కొట్టు దిమ్మె మీదున్న టైలరు కిచ్చి డ్రెస్ కుట్టించాడు.

మర్నాటికల్లా బట్టలు రెడీ. అవి తీసుకుని కరీం, వెంకారెడ్డి ఇంటికి వచ్చారు. వేసుకుని చూసుకుంటే ఖదీర్‌కి, వాళ్ల అన్నకి, వాళ్ల తమ్ముడికి, వాళ్ల చెల్లికి అందరికీ పైనుంచి కింద దాకా బ్లూయే! ఖదీర్

ఎంకారెడ్డనా మరీ అన్యాలంగా బులుగంటే బులుగా' అని అడగతా వుంది. 'మా యింటాయనా నువ్వు యిలా చెల్లు బేరాలు వేసుకుంటూ వుంటే ఎప్పటికి బాగుపడతారు తండ్రీ' అని అడగతా వుంది.' అంటాడు.



నిజమే కదా, ఖదీర్ తల్లి కున్న ప్రాక్టికల్ నాలెజ్ మొగవాళ్లిద్దరికీ లోపించిందని తెలుస్తోంది కదా!



కరీంభాయ్ ఎలక్ట్రిక్ వర్క్‌లో ట్రిక్కులు నేర్వని మనిషి. ఉత్తుత్తినే పని పెద్దది చేసి డబ్బులు లాగడం తెలియదు. 'మీరే చేసేసుకోచ్చు' అని వాళ్లకే కిటుకు చెప్పేసేవాడు. ఎక్కువ మెటీరియల్ కొనిపించి కమీషన్ సంపాదించేవాడు కాదు. తనకు వీలున్నంతవరకు యింకోళ్లకు ఉపకారాలు చేసేవాడు. ఇవన్నీ చెబుతూనే ఖదీర్ తన తండ్రిని ఆకాశానికి ఎత్తేయలేదు. అతని బద్ధకం గురించీ కథలు చెప్పాడు.

ఎంత రాత్రయినా సరే టీలు తాగి పని పూర్తి చేసేవాడు కానీ పొద్దుటి వేళలో పనంటే కోటి రూపాయలు యిచ్చినా కదిలేవాడు కాదు. తెల్లారి లేవడం కంటే నామర్దా పని లేదుట ఖదీర్‌బాబు వంశంలో. పొద్దున్నే ఎవరైనా వచ్చి 'మా పొలంలో మోటారు బిగించాలి రా బాబూ' అంటూ వెంటబడితే 'నీకెందుకు నువ్వు పా భాయ్. అయిదే అయిదు నిమిషాల్లో ఆడుంటా' అని భరోసా యిచ్చి పంపేసి ముసుగెట్టేవాడు. తెల్లారి పది గంటలైనా ముసుగు తీసేవాడు కాదు.

ఇలాటి వాడిపై భార్యకు ఎంత మంట వుంటుందో ఓ కథలో చెప్తాడు ఖదీర్. చహార్షుంబా అనే ఓ ముస్లిం పండగ రోజున సముద్రస్నానానికి అందరూ సముద్రతీరానికి వెళతారు. అందరూ కలిసి సూర్యోదయం చూసి మురిసిపోతారు. కరీం భాయ్ 'ఎంతైనా పొద్దున్నే నిద్ర మేలుకుంటే బాగానే వుండేట్టుంది' అంటాడు ఆవలిస్తూ. వాళ్లావిడ చురచురా చూస్తూ 'పొద్దున్నే మేలుకోబళ్లేదు నాయినా. అసలికి మేలుకుంటే చాలు' అని అంటించిందిట.

ఇలాటి పరిస్థితిలో సంసారం సాగాలంటే ఆవిడెంత టక్కు టమార విద్యలు నేర్వాలో ఊహించండి. పిల్లల పొట్టలు నింపేందుకు రంజాన్ మాసంలో కూడా చేయవలసిన మోసాలు గురించి ఇందాకే చెప్పాను. దర్గామిట్టలో రొట్టెల పండగ జరిగినపుడు బోల్డు రొట్టెలు కొట్టుకొచ్చేది ఆవిడ. ఆ పండగలో మొక్కులు తీరినవాళ్లు రొట్టెలు యివ్వాలి. మొక్కులు కోరేవాళ్లు రొట్టెలు పట్టాలి. ఈవిడెప్పుడూ పట్టే బ్యాచ్‌లోనే వుండేది. ఆ రొట్టెలు కూడా ఒక్కో కోరికకు ఒక్కో రొట్టె. సంతానం రొట్టె, ఆరోగ్యం రొట్టె, సంపాదన రొట్టె, చదువు రొట్టె, సౌభాగ్యం రొట్టె... యిలా... ఈవిడ అన్ని రకాల రొట్టెలూ తీసుకునేది. అన్ని అవసరాలు తీరడం మాట ఎలాగున్నా ముందు పిల్లల ఆకలైతే తీరుతుంది కదా. కథ చివర్లో 'ఇల్లాలి కోరికలు' సినిమాకూ, ఈ తంతుకూ ముడిపెట్టి ఖదీర్ కథను వ్యాసంలా మిగలకుండా కాపాడాడు.

ఖదీర్ తల్లి గురించి చెపుతున్నాను కదూ, ఎంతసేపూ ఆకలిగోలే కాదు, చిన్న చిన్న సరదాలుంటాయి కదా. సినిమాలు చూడాలనీ, అదీ. సినిమాకి వెళ్లాలంటే మాత్రం ఆవిడ ఘోషా పాటించేది. తక్కినప్పుడు ఘోషా, ఫీషా జాన్తానై. కానీ అత్తగారి నోటికి దడిసి సినిమాకు వెళ్లినపుడు మాత్రం తెల్ల దుప్పటి బయటకులాగి, యింకో దుప్పటి రిక్షాకు కట్టించుకుని వెళ్లేది.



క్లాసులోంచి దభీమని బెంచీ క్లాసులోకి దూకేయడమే!

ఓ సారి యిలాగే దూకాక చీకట్లో దోవ కనబడక అటూ యిటూ తడుముకుంటూంటే 'ఈడ్రో..యీడా' అని తల్లి పిలిచింది. పక్కనున్న సీట్లో కూచోపెట్టుకుంది. ఇతను కూచున్నాక పక్కనున్న ఆడమనిషి వీళ్లిద్దరినీ ఎగాదిగా చూసి, "మనిషుండాడు.. మనిషుండాడు అంటా ఉన్న ఒక్క సీటులో మా ఆడబిడ్డని కూచోనీకుండా చేసినావు. నేల్లోనుంచి దూకిన యీ బుద్దిపీసేనంటమ్మా మనిషా" అని అందిట తుస్కారంగా.


కానీ యిలాటివన్నీ పట్టించుకుంటే బండి నడిచేదెలా?

బండి నడవడానికి వాళ్ల అమ్మ పూల వ్యాపారం చేసేది. వాళ్లు కొత్తిల్లు కొనుక్కొని పాతూరు వెళ్లాక అక్కడ రెక్కలు లేని కిటికీలు మూయడానికి పరదాలు లేక సన్నజాజి పూలతీగ వేయడం జరిగింది. అది విరగబూసేది. ఈవిడ పూలన్నీ కోసి ఒక్కోటి లెక్కెట్టి వంద ఇరవై పైసలు చొప్పున అమ్మేది. ఒక్కటికూడా తను పెట్టుకునేది కాదు. రోజుకి పదిహేను వందల పూలు పూస్తే మూడు రూపాయలు వచ్చినట్టేగా. అది పాల ఖర్చుకైనా వస్తుందని ఆవిడ ఆశ.

అప్పటికీ కరీంభాయ్ శాయశక్తులా ఆ వ్యాపారానికి అడ్డుకొట్టబోయేడు. 'కావాలంటే ఆ పూలు ఎవరికైనా వూరికే యిచ్చేయ్. వ్యాపారం చేసి పరువు తీయకు' అని. 'నువు ఎంకటగిరి రాజా అయిననాడు ఆట్నే ఊరకే యిద్దూగానీ ఇప్పుడు మాత్రం గమ్మునుండు' అని నోరు మూయించిందీవిడ. ఆ పూలచెట్టు బాగా పెరగడానికి వాడేసిన టీ ఆకు వేయాలని కొడుకుని టీకొట్టుకు తరిమేది. దిష్టి తగలకుండా మట్టికుండ కట్టేది.

ఇంతకీ ఈ పూలన్నీ రిహానా అనే ఆమెకు అమ్మేది. వాళ్లు దండలు చేసి బజార్లో అమ్ముకునేవారు. ఈమెకు వారం వారం డబ్బులిచ్చేవాళ్లు. అలాటిది ఓ సారి డబ్బు ఆలస్యం చేసి పేచీ పెట్టుకుని మానేశారు. ఎంత దుర్మార్గురాల్రా అనిపిస్తుంది. కథ చివరికి వచ్చేసరికి తెలుస్తుంది వాళ్ల అవస్త ఏమిటాని. శ్రావణమాసం కదాని పెట్టుబడి పెట్టి రెడీమేడ్ దండలు తయారుచేసుకుంటారు. బేరాలు రాలేదు. దాచి వుంచలేరు కదా చేతులారా దండల్ని మురిక్కాలువలో పడేయవలసి వస్తుంది. ఈమెకు డబ్బు యియ్యలేక, ఆ మాట చెప్పడానికి మొహం చెల్లక, పేచీ పెట్టుకుంటారు వాళ్లు. పాపం బడుగు బతుకులు అనిపిస్తుంది.

ఈ గతుకుల్లో బతుకుబండి సవ్యంగా సాగదు. ఖదీర్ అన్నకు చదువు అబ్బలేదు. క్లాసులు ఎగ్గొట్టడం, తన్నులు తినడం. ఎనిమిదో క్లాసు వచ్చేసరికి 'బడికి పోను, ఎలక్ట్రీపని నేర్చుకుంటాను' అని మొండికేశాడు. దాంతో తండ్రికి దిక్కులేకపోయింది. ఏ పనైతే పగవాడికి కూడా వద్దనుకున్నాడో ఆ ఎలక్ట్రిక్ పనినే స్వయానా కొడుక్కి నేర్పించి క్రమంగా అతని సంపాదన మీద ఆధారపడిపోయాడు. ఖదీర్ కంప్యూటర్ బియస్సీ అన్నా, తమ్ముడు రెసిడెన్షియల్ స్కూలు అన్నా, చెల్లెలు మరోటన్నా అన్నిటికీ అన్నగారి సంపాదనే ఆధారం!



కట్టేవాడట. ఆ మాత్రం పది రూపాయలు సంపాదించలేకనా? వాళ్ల యాటిట్యూడ్ అలా వుంటుందంతే!

అలాగే జామెట్రీబాక్సు తేకపోతే క్లాసులోకి రానీయనని లెక్కల టీచరన్నా కొనడు. ఆ టీచరు ఖదీరును యింటికి పంపేస్తాడు. సంగతి విని కరీంభాయ్ 'కొనుక్కుందుగానీ ముందిప్పుడు టెంపరరీగా పని జరిగేట్టు చూడు. ఆనేక తెచ్చుకుందువు' అనేసి మహరాజల్లే బజారు కెళ్లిపోతాడు. ఈ కుర్రాడు ఏడుస్తూ కూచుంటాడు. నాయనమ్మ రూపాయిచ్చి పొడుగు చెక్క స్కేలు అమరుస్తుంది. తల్లి ఎక్కణ్నుంచో చిలుము పట్టిన వృత్తలేఖిని తెచ్చి యిస్తుంది.

మర్నాడు లెక్కల పీరియడులో టీచరు అడగ్గానే యివి చూపిస్తాడు కుర్రాడు. 'ఇవి చాలా?' అంటాడు టీచరు. 'చాలుగద సార్' అంటాడు కుర్రాడు భయంగా, బుగ్గలకు చేతులు అడ్డం పెట్టుకుంటూ. 'అయితే కోణమానిని లేకుండా లంబరేఖ ఎట్టా గీస్తావో గియ్యి' అంటాడు టీచరు. ఎలా గీస్తాడు? పిల్లాడు బిత్తరచూపులు చూస్తాడు. అక్కడ రాస్తాడు - 'అప్పుడు.. నాయినా... చాక్‌పీసు అవతల పారేసి.. నా బిత్తర చూపులు తీరేంతదాకా - మాల్యాద్రయివోరు తన్నినాడూ చూడూ.. ఒళ్లు పులిబొంగరం అయిపోయింది సామీ!'


వర్ణనకు ఓ పక్క నవ్వొస్తుంది. ఓ పక్క ఏడుపొస్తుంది - అయ్యో ఇందులో ఈ పిల్లవాడి తప్పేముంది? అని. ఇలాటి సంఘటనల వల్లనే కదా చార్లీచాప్లిన్ సినిమాలు మనకు నచ్చాయి!

దీనికి ఫుట్ నోట్ ఒకటి - 'యింత వాయింపుడు కార్యక్రమం అయినా మా నాన్న కొనలా. 'కొందాము.. కొందాము' అంటూనే లాగించేశాడు. నా చదువు పూర్తయిపోయింది కానీ జామెట్రీ బాక్సు కొనలేదు.' అని.

ఎక్కడా తనను చూసి జాలిపడమని  ఖదీర్‌బాబు రాయడు. ఎక్కడా బిట్టర్‌నెస్ కనబరచడు. మేటర్ ఆఫ్ ఫాక్ట్‌లీగా రాసుకుపోయాడు. దరిద్రాన్ని ఎంత రొమాంటిక్‌గా, అందంగా రాశాడంటే అయ్యో మనం కూడా అనుభవించి వుంటే బాగుండేది అనిపిస్తుంది.

ఖదీర్ బాల్యంలో ఓ చాప్టర్ సమ్మర్ హాలిడేస్‌లో బంగారం కొట్టులో అసిస్టెంటుగా నౌకరీ. అది వాళ్ల తాత అంటే మాతామహుడి కొట్టు. బంగారం అని పేరే గానీ తాళిబొట్లు, రాళ్లకమ్మలు, వెండి పట్టీల రిపేరు - యివే ఎక్కువ బేరం. రిపేరు చేయడానికి నిప్పుల కుంపటి కావాలి. అది వెలిగించి ఆరిపోకుండా చూడవలసిన పని ఇతనిది. దానికి గాను రోజుకి రెండు రూపాయల కూలి. ఆ సంపాదనకు ఆశపడి వేసంగి సెలవుల్లో చదువుమీదకు దృష్టిపోదు ఖదీర్‌కు. ఓ హిందీ టీచరు అక్క కొడుకు విశ్వం సెలవులకు వస్తాడు. ఖదీర్ దృష్టిలో అతను అధికప్రసంగి గాడు. ఎందుకంటే ఆరోక్లాసు సెలవుల్లో ఏడో క్లాసు లెక్కలు చదువుకుందామని ఉబలాటపడే సన్నాసి వాడు. ఇతనికి లెక్కలొక బాధ. ఈ అధిక సంపాదన పోతుందనే బాధ మరోటి.

ఓ రోజు వాళ్ల తాత యిచ్చిన బక్షీసుతో సహా ఐదు రూపాయలు సంపాదించి ఖదీర్ ఎగురుకుంటూ వెళ్లి విశ్వానికి చూపిస్తాడు. గంటసేపుగా తంటాలు పడిన లెక్క వచ్చినందుకు విశ్వం ఆనందిస్తూ కనబడతాడు. ఎవరి ఆనందం వాళ్లది. ఆ విశ్వం ఇలాగే సెలవుల్లో పై క్లాసు చదువులు చదివేసి ఇప్పుడు రెండు జేబులా జీతం పెట్టుకునేటంత పెద్ద ఉద్యోగి అయిపోయాడు. ఖదీర్‌తో బాటు



చాలా చెడ్డది. ఆ పిల్లల సంపాదనలో చాలాభాగం వ్యసనాలకు పోతుంది, వాళ్లు సమాజం పట్ల వైరాన్ని పెంచుకుంటారు, పెద్దయ్యాక మరింతమంది బాల కార్మికులను తయారుచేస్తారు. సమాజవ్యతిరేక కార్యకలాపాల్లో పాలు పంచుకుంటారు. విశ్వంలాటి వాళ్లు మెట్లెక్కి పైపైకి వెళుతూంటే ఆ పాటి అవకాశాలున్న ముస్లిం కుర్రాళ్లు యిలా కిందకు కిందకు జారడం ఎందుకు? ఆలోచించమంటాడు ఖదీర్!

ఈ కథల్లో తన బంగారు బాల్యం గురించి చెప్తాడు ఖదీర్‌బాబు. పీర్ల పండగ గురించి చెప్తాడు. వాళ్ల మేనమామ గుండాలు తొక్కడం గురించి చెప్తాడు. నా బొందో అని బాధ్యతను నెత్తికెత్తుకుని శ్రమించిన పీర్లసాయిబు గురించి చెప్తాడు. ఈనాడు పీర్లసాయిబూ లేడు, అగ్నిగుండాలు తొక్కడమూ లేదని వాపోతాడు. అలాగే చిన్నప్పుడు పందిని తాకితే ఎంత భయపడి చచ్చాడో చెప్పుకొస్తాడు. పందిని వాళ్లు కాలా జాన్వర్ అంటారు. అది తాకితే చాలు నరకానికి పోయినట్టేనని భయం!

స్కూల్లో అల్లరి కుర్రాళ్లుంటారుగా, వద్దని ఇతను బతిమాలిన కొద్దీ ఆట పట్టించడానికి వాళ్లు పందిమీద తోసేస్తూంటారు. చివరకి అలా ఓ రోజు వెళ్లి పందిమీద పడడమూ జరుగుతుంది. ఇక వాళ్ల నాయనమ్మ ప్రాయశ్చిత్తం చేయడానికి బిందెడు నీళ్లు చెంబు, చెంబూ చొప్పున నెత్తిమీద పోసి శుద్ధి చేశాకనే లోపలకి రానిస్తుంది. ఇతని కథ ఇంకా నయం. షమ్మీ వాళ్లన్నైతే వాళ్లమ్మ పంది ముట్టుకు వచ్చినందుకు మూడు పగళ్లూ, మూడు రాత్రిళ్లూ తిడుతూనే వుందిట.

పెళ్లి ముచ్చట్లు కూడా ఖదీర్ రాశాడు. వాళ్ల అమ్మ, నజీరత్త కలిసి ఒకడి జీవితంతో ఆడుకున్న వ్యవహారం రాస్తాడు. వాళ్లల్లో పెళ్లికిముందు అమ్మాయి, అబ్బాయి ఒకరినొకరు చూసుకోకూడదు. ఫోటోల్లో కూడా! పెద్దలు చూసివచ్చి వర్ణించి చెప్పినదానిమీదనే మొత్తమంతా ఆధారపడి వుంది. హిందువుల్లో కూడా కొన్ని కులాల్లో ఇదే తంతు. వీళ్లిద్దరూ ఓ అమ్మాయిని రంభ అనీ తెల్లగా వుంటుందనీ - 'కడిగి నీళ్లు తాగాల్సిన రంగులే అది. తెల్లటి తెలుపనుకో పో - యేమీ' అని ఉబ్బేసి పెళ్లికొడుకు చేత ఓకే అనిపిస్తారు.

ఓ పక్క అతని కజిన్ వచ్చి 'వీళ్ల మాటలు నమ్మినావో మునిగిపోతావు. ముందర ఫోటో చూసి ఆనేకనే ఊ అను' అని సలహా యిచ్చినా పెళ్లికొడుకు వీళ్లమాట మీదనే ప్రొసీడయిపోతాడు. పెళ్లయ్యాక జల్వా కార్యక్రమంలో పెళ్లికూతుర్ని తొలిసారి ప్రత్యక్షంగా చూస్తాడు. అప్పటిదాకా అప్పగింతల ఏడుపులు ఏడ్చీ, చెమటతో తడిసిపోయి పెళ్లికూతురు మొహం నలుపులోకి తిరిగిపోయివుంది.

దెబ్బకి పెళ్లికొడుకు మంచం మీంచి లేచి బస్టాండుకు వెళ్లి కూచుంటాడు. దానిమీద పందిట్లో

కథకు ముగింపు ఏమిటంటే మర్నాటినుండి పెళ్లికొడుకు సర్దిచెప్పుకుని భార్యకు అనుకూలంగా వుంటాడు. అప్పటినుండీ మాత్రం వాళ్ల కుటుంబంలో ఫోటో చూపించందే పెళ్లిళ్లు జరగటం లేదంటాడు. అంతేకాదు ఇంకో కథ చెబుతూ కుటుంబ నియంత్రణ పాటిస్తున్నారంటాడు. అంటే క్రమేపీ మార్పు వస్తోందన్నమాట.

ఈ కథల్లోనే కొన్ని లోతైన సబ్జక్టలని కూడా పరామర్శించాడు ఖదీర్‌బాబు. వాళ్ల బంధువుల్లోనే బాగా బతికి చెడ్డవాళ్లున్నారు. ఒకతను మంచి టైలరే గానీ అనవసరంగా తాగి పెళ్లాన్ని హింసించేవాడు. బావమరుదులు వచ్చి బెదిరిస్తే ఏకంగా ఊరొదిలి పారిపోయాడు. భార్య హాస్పటల్లో అటెండరుగా పనిచేసేది. మొదటి యిద్దరు పిల్లలకు చదువులు అంటలేదు. మూడోవాడికి దూదేకుల సర్టిఫికేట్ తెచ్చుకుంటే  ఇంటర్లో ఫీజు కన్సెషన్ వస్తుంది కదాని ఆశ పడుతుంది.



దూదేకుల అన్నది ముస్లింలలో బ్యాక్‌వర్డ్ కింద లెక్క. వాళ్లలో హిందూత్వ ఛాయలు చాలా వుండడం వల్ల వాళ్లని ముస్లిములు తక్కువగా చూడడం వుంది. వాళ్లని బ్యాక్‌వర్డ్ క్లాసులకింద వేసి ప్రభుత్వం కొన్ని రిజర్వేషన్లు యిస్తోంది. వాటికోసం ప్రతి ముస్లిము దూదేకుల కులానికి చెందినట్టు బోగస్ సర్టిఫికెట్లు సంపాదించేదానికి ప్రయత్నించడం ఆరంభమైంది. అందువల్ల దూదేకుల సంఘం వాళ్లు ఊళ్లోవున్న వాళ్ల కుటుంబాల లిస్టు యిచ్చి ఇంతకుమించి వేరెవరికైనా యిచ్చావో ఖబర్దార్ అని కరణాన్ని హెచ్చరించడం జరిగింది. అందువల్ల అతను  వీళ్లు కోరిన సర్టిఫికెట్టు యివ్వలేకపోతాడు.

నిజానికి ఖదీర్ సెవెన్త్ క్లాసులో వుండగా వాళ్ల స్కూలు కరస్పాండెంటు కరీంభాయ్‌ను పిల్చి 'మీ కులం దూదేకుల అని రాయిస్తే ఫీజులు తగ్గుతాయి' అని హితవు చెప్పబోతాడు. కరీం భాయ్ బద్ధకస్తుడు కావచ్చు, కొడుక్కి స్కూలు ఫీజు కట్టడం ఆలస్యం చేయవచ్చు, జామెట్రీ బాక్సు కొనివ్వకపోవచ్చు, కానీ అతనంటాడు 'వాళ్ల సర్టిఫికెట్టు మనమెందుకు రాయించుకోవాల? వాళ్లకు దక్కాల్సింది మనమెందుకు తినాల?' అని అంటాడు. అదీ నీతి! కొండకాపు అనీ కొండ రెడ్డి అనీ దొంగ సర్టిఫికెట్లు తెచ్చుకునేవాళ్లు సిగ్గుపడే విధంగా వుంది కథ!

నిజానికి రిజర్వేషన్లతో దూదేకుల వాళ్లు బాగుపడ్డారా? నాకు తెలియదు. నాకు తెలిసి ముస్లిములు బాగుపడ్డది దుబాయి వెళ్లి కష్టపడడం వల్ల. వాళ్లకు చదువుల మీద ఇంట్రస్టు వుండమంటే ఏం వుంటుంది? 'చదువుకున్నా మా వాళ్లకు పెద్ద ఉద్యోగాలు యివ్వరు' అని వాళ్ల ప్రగాఢ నమ్మకం.

ప్రయివేటు రంగంలో కొన్ని కమ్యూనిటీలవాళ్లు వీళ్లకి ఉద్యోగాలు యివ్వరు. ప్రభుత్వ రంగంలో కూడా బంధుప్రీతి ఎక్కువ కాబట్టి వీళ్ల వాటాకు దక్కేవి బహు తక్కువ. ముందుగా ఉద్యోగాల్లో దూరినవాళ్లు వాళ్ల వాళ్లనే వేసుకుంటుంటారు. నేనిందాకా చెప్పినట్టు ముస్లిములు ఇంగ్లీషు చదువుల రైలు లేటుగా ఎక్కారు. ఎంత లేటంటే - రెండు మూడు తరాల లేటు. ఈ లోపునే తక్కినవాళ్లు వీళ్లు అందుకోలేనంత దూరం వెళ్లిపోయారు. వీళ్లకి గతవైభవమే మిగిలింది.

దర్గామిట్ట కతల్లో దూదేకుల వాళ్ల రిజర్వేషన్ కథ చదివితే నేటి ముస్లిం రిజర్వేషన్ ఇస్యూ గుర్తుకు



హరిజనులు ముస్లిములుగా మారి సవర్ణుల చెరువులోకి దూకితే వీళ్ల నోరెత్తలేక పోతారు. హిందువులు వారిని తమకంటె వేరుగా చూశారేమో కానీ తక్కువగా చూడలేదు.

ఈ రోజు రిజర్వేషన్లు మొదలెట్టాక మళ్లీ ఎవరైనా రివ్యూ చేయగలరా? ఒక అవిటివాడికి రిజర్వేషన్ యిస్తే అర్థముంది. అతనికి మళ్లీ కాలు మొలవదు. కానీ యిలాటి కేసుల్లో రిజర్వేషన్ వల్ల అతని ఆర్థికస్థితి, సామాజిక హోదా బాగుపడ్డాయనుకోండి. అప్పుడు ఆ కుటుంబానికి రిజర్వేషన్ సౌకర్యం ఆపగలరా? తక్కినవాటిల్లో ఆపగలిగారా?

మరి ఇలాటి పండోరాస్ బాక్సను ఎందుకు తెరుస్తున్నట్టు? ఓట్ల బ్యాంకు పాలిటిక్స్ కోసం. నిజానికి ఆంధ్రలో ముస్లింలు ఎన్‌బ్లాక్ ఎవరికైనా ఓటేసారనడానికి ఆధారాలు లేవు. అందరూ ఎన్టీయార్‌కు వేసినప్పుడు వాళ్లూ ఎన్టీయార్‌కే వేశారు. అందరూ వైయస్‌కి వేస్తే వాళ్లూ వైయస్‌కే వేశారు. హైదరాబాద్‌లోని ఓల్డ్‌సిటీలో కూడా అక్కడి ముస్లిములు ఒక పార్టీని నమ్మారు. మతపరంగా ఓట్లు వేసారనడానికి లేదు. ఎందుకంటే ఆ పార్టీలోంచే కొంతమంది విడిగా వస్తే వాళ్లకు వేయలేదు. వాళ్లూ ముస్లిములే!

తమిళ, మలయాళ ప్రాంతాల్లో ముస్లిముల పరిస్థితి చాలా బాగుంది. ఆంధ్రలోనే బాగా లేదు. మరి వాళ్ల పరిస్థితి మెరుగు పడడం ఎలా? అది ముల్లాల చేతిలో లేదు. బయటనుండి జాలిపడేవారి చేతిలో లేదు. ఈళ్వాలలో నారాయణగురు, హరిజనుల్లో అంబేద్కర్ – ఇలా వాళ్ల కమ్యూనిటీలోనే మార్గదర్శకులు పుట్టాలి. ఛాందసవాదానికి దూరంగా, చదువు సంధ్యలకు దగ్గరగా వాళ్లను నడిపించాలి. దర్గామిట్ట కథలు చదివిన మెజారిటీ కమ్యూనిటీ సభ్యులు వాళ్లకు అండగా నిలవాలి.

ఈ పుస్తకానికి ముందుమాటలో ముళ్లపూడి వెంకటరమణగారు రాశారు. 'వేదంలా ప్రవహించే తెలుగు జీవనదిలో ముస్లిం జీవన స్రవంతి ఇంతకాలం అంతర్వాహినిగా-కనబడకుండా ప్రవహిస్తూ వుండాలి. ఖదీర్‌బాబు – దర్గామిట్ట కతలతో భగీరథుడిలా ఆ నదిని మనముందు మళ్లించాడు.' అని. కానీ పుస్తకం ఆవిష్కరణ సభలో మాత్రం కొంతమంది వక్తలు మహా బాధ పడిపోయారు. మెజారిటీ కమ్యూనిటీవాళ్లు యిన్నాళ్లూ ఈ మైనారిటీ గొంతును నొక్కి పట్టారని వాపోయారు. అతని భాషలో అతను రాసుకునే అవకాశం కల్పించని సమాజంపై విరుచుకు పడ్డారు.

ఈ పాయింటు నాకు అర్థం కాదు. మెజారిటీ కమ్యూనిటీవాళ్లు ఫలానాది రాయి ఫలానాది రాయద్దు అని ఎవర్నయినా శాసిస్తారా? నిజానికి హిందువుల్లోనే అనేక వర్గాల గురించి కథలు లేవు, వాళ్ల సమాచారమూ మనకు తెలియదు. తొలితరం రచయితల్లో చాలామంది బ్రాహ్మణులు వున్నారు కానీ ఓ పురోహితుడు, ఓ తద్దినం బ్రాహ్మడి లైఫ్ గురించి కథలు వున్నాయా? ఓ గుళ్లో పూజారి గురించి కథలు వున్నాయా? అతనికీ ఆశలూ, నిరాశలూ, దగాలూ, మోసాలూ అన్నీ వుంటాయిగా. మనకేమైనా తెలుసా? అమరావతి కథల్లో 'తులసి తాంబూలం' చదువుతూంటే శివాలయంలో వైష్ణవ పూజారి గోడు కాస్త తెలిసింది.

అని శాసించే పీఠాధిపతులు నాకు తెలిసినంతవరకూ ఎవరూ లేరు. ఇక ఖదీర్ అతని మాతృభాషలోనే కథలు రాసుకున్నా ఎవ్వరికీ అభ్యంతరం వుండేది కాదు. మన కెవ్వరికీ అతని గురించి తెలిసేది కాదు. అతను చాసో అవార్డు అందుకునే వాడే కాదు. అవును, మహాకథాశిల్పి చాసో పేరిట యిచ్చే ఎవార్డును ఖదీర్‌కు ఈమధ్యే విజయనగరంలో యిచ్చారు.


ఖదీర్ నాకు ఈ కథలు రాసేముందునుండీ తెలుసు. ఆంధ్రజ్యోతి ఆదివారంలో ఉమామహేశ్వరరావుకి అసిస్టెంటుగా వుండేవాడు. సరదాగా మాట్లాడేవాడు. అతనిలో యింతటి కథకుడు దాగి వున్నాడని నా కప్పుడు తెలియదు. నామిని పుణ్యమాని నాకే కాదు, చాలా మందికి అతని ప్రతిభ బయటపడింది. ఆ తర్వాత అతను 'పోలేరమ్మబండకథలు' అని స్కూలు జీవితం గురించి కథలు రాశాడు. ఇదే స్టయిల్, ఆత్మీయమైన కథనం.

అతను యింకా యింకా మంచి కథలు రాయాలి. 'దర్గామిట్ట కతలు'ను అతను తండ్రికి అంకితం యిచ్చాడు. తండ్రిలా ఆదుకున్న అన్నగారిని సభకు ఆహ్వానించి గౌరవించాడు. అన్న యింకా ఎలక్ట్రీషియన్‌గానే వున్నాడు. ఆత్మకథను నిజాయితీగా రాయడమే కాదు, తన వాళ్లను నిజాయితీగా ప్రదర్శించినందుకు అందరూ అబ్బురపడ్డారు, అభినందించారు. మనందరిలోనూ మట్టివాసన పోలేదన్నమాట. మౌలిక విలువలు మాసిపోలేదన్నమాట. అందుకే ఖదీర్ బాల్యంలో మన బాల్యాన్ని దర్శించాం. చదివి పులకించాం.

ఈ కథలు ఆంధ్రజ్యోతి వీక్లీలో పడుతూండగానే ముళ్లపూడి వెంకటరమణగారు వచ్చి ఇతనెవరో అంతకుముందు తెలియకపోయినా, అభినందించి స్వీటు పాకెట్టు చేతిలో పెట్టి అభినందించారు.

ప్రచురణ టైములో అభినందించడమే కాదు, ఈ పుస్తకానికి ముందుమాట కూడా రాశారు - 'అచ్చుతప్పులూ అవకతవకలూ అయోమయాలూ సందేశాలూ సమస్యల పరిష్కారాలూ వున్న కథల గురించి రాయడం బలే జిల్లయిన పని. మన క్లవర్లూ చమత్కారాలూ మిరియాలూ గుప్పించి పేట్రేగిపోవచ్చు. వర్ధమాన రచయిత తల నిమిరి వెన్ను తట్టి ఎంకరేజి చేసి షైనయిపోవచ్చు. కానీ ఆ వర్ధమానుడు అయిదడుగులు కాకుండా జైన విగ్రహంలా మరీ అరవై అడుగుల ఎత్తున వుంటే వాడి వెన్ను తట్టడం ఎలా? ఇక రాసేదేముంది. చేసేదేముంది. చేతులు జోడించి నమస్కరించడం తప్ప!'

దీన్ని బట్టి కథల స్టాండర్డ్‌పై మీకు ఓ అంచనా వచ్చి వుంటుంది.



# మా పసలపూడి కథలు

ఈ కథలు రాసిన వంశీ రచయిత, సినిమా డైరక్టరు. తెలుగు సినిమాలలో వంశీ సినిమాలకు ఓ ప్రత్యేకత వుంది. కథ ఎంచుకోవడంలోగానీ, హాస్యం రంగరించడంలో గానీ, పాటల చిత్రీకరణలో గానీ, సినిమాకు టైటిల్ పెట్టడంలో గానీ వంశీ స్కూలు వంశీదే! పూర్తి హాస్యచిత్రమే కాదు, పూర్తి డిటెక్టివ్ సినిమా కూడా తీశారాయన. డిటెక్షన్‌లో హాస్యం కలగలిపి 'డిటెక్టివ్ నారద' వంటి సినిమా తీసి ప్రేక్షకులను తబ్బిబ్బు చేయగలరు. ఏ సినిమా తీసినా పల్లెటూరి నేపథ్యంతో తీయడం కూడా ఆయన స్టయిలే!

'మా పసలపూడి కథలు' స్వాతి వీక్లీలో 72 వారాలపాటు సీరియల్‌గా వెలువడ్డాయి. పాఠకులనే కాదు, రచయితలనూ ఆకట్టుకున్నాయి. అనేకమంది రచయితలు తమ అభిప్రాయాలను వెలువరించారు. అవన్నీ వారివారి ఫోటోలతో సహా ప్రతివారం వేశారు. పుస్తకంగా వెలువరించినప్పుడు దాన్ని ఆ 72 రచయితలకూ అంకితం యిచ్చారు వంశీ. ఆ అభిప్రాయాల్లో చాలామంది వీటిని ఆర్కె నారాయణ్ మాల్గుడి కథలతోనూ, శంకరమంచి సత్యంగారి 'అమరావతి కథలు' తోనూ పోల్చారు. ఒక ఊరిని బేస్ చేసుకుని చెప్పడం వల్ల ఆ పోలిక వెంటనే తడుతుంది కానీ వేటి రుచి వాటిదే! మనం చెప్పుకుంటున్న ఈ సీరీస్‌లో మిట్టూరోడి కథలు, దర్గామిట్ట కథలు ఉత్తమపురుషలో, అంటే ఫస్ట్ పెర్సన్‌లో చెప్పినవి కాగా అమరావతి కథలు, పసలపూడి కథలు వేరే కథకుడు చెప్పినట్టుగా వుంటాయి. అమరావతి కథల్లో కథకుడు తాదాత్మ్యంతో చెప్పినట్టు వుంటాయి. కానీ పసలపూడి కథల తీరు వేరు.

పసలపూడి కథల్లో కథకుడు ఎలా చెప్తాడో ఓ ఉదాహరణ చెప్తాను, వినండి. మీరు సిటీనుంచి వెళ్లి ఓ పల్లెటూళ్లో బస్టాండ్‌లో నిలబడ్డారండి. బస్సు గురించి కాస్సేపు చూసి పక్కన చుట్ట కాల్చుకుంటున్న ఒకతన్ని 'ద్రాక్షారం బస్సు వెళ్లిపోయిందాండి?' అని అడిగేరండి. అప్పుడతను స్ట్రెయిట్‌గా జవాబిస్తాడా? ఇచ్చి వూరుకుంటాడా? అబ్బే! "ఈ పాటికి వచ్చేసుండాలండీ, వచ్చిందో, లేదో. అయినా కొత్త




డయివర్ నూకరాజు వచ్చాక టయానికి రావడం అన్న పద్ధతే పోయిందండి. ఇదివరకు బుల్లెమ్మగారి సూర్రావయితే బస్సొచ్చేయేళ చూసి గడియారంలో టైము ఎట్టుకోవాలన్నమాట. అంత కరకట్టుగా వుండేది. ఇప్పుడు ఈడేటి.., ఈ నూకరాజు గాడు,, వీడెవడో కాదండి, చెరువుపక్కన గొల్లోళ్ల ఎత్తరుగుల యిల్లు లేదూ, ఆ యింటికోడలు వరలక్ష్మి తమ్ముడేనండి. బిక్కవోల్లో ఈడికో ముండుందండి. ఎంకమ్మ అని పెద్దాపురంలో ఏనుగుగుమ్మాల యిలులేదూ, అదేనండీ, గుడికాణ్నుంచి


బుల్లెంకమ్మంటారు – దాని కూతురేనండి. దసరాబుల్లోడు సినిమా సూటింగు చూడ్డానికని ఎళ్లి అక్కడ డైరట్టరుగారిని తుప్పల్లోకి లాగేసిందని చెప్పుకుంటారు.

"అబ్బ కూతురు కాదండి బాబూ, అదింకా అప్పటికి పుట్టనే లేదు.. తల్లే! బుల్లెంకమ్మంటారు కానీ చెయ్యెత్తు మనిషి అది. కూతురూ అదే సైజు. సూడ్డానికి రెండు కళ్లూ చాలవు. పట్టుకోడానికి రెండు సేతులూ చాలవు. బిక్కవోలు సీతాలచ్మి అంటే చాలు, మహామహావాడే చొంగ కార్చుకుంటాడు! ఈ బస్సు డైవోరు నూకరాజనగా ఎంత! మధ్యాన్నం ట్రిప్పులో అక్కడో పాలి తొంగుని కానీ రాడండి. వీడి పెళ్లాంకు సంగతిదని యింకా కచ్చితంగా తెలీదండి. అదసలే జగజ్జంత్రీ. ఆ మాట కొస్తే ఈ సీతాలచ్మి కూడా కంత్రీయేనండి. డైవోరు నూకరాజుతోనే కాదు క్లీనరు యానాదుల కుర్రాడు బుచ్చిబాబుతో కూడా యవ్వారం మోపు చేస్తోందండి. మీరాణ్ని చూసేవుంటారండి, ఇంతెత్తు గేరాజుత్తూ ఆడూసూ, సినేమా ఈరోలా వుంటాడు. ఇప్పుడున్నవాళ్లెవరూ సాల్రండి. సైకిలెక్కి పెడలు కొడితే దుళ్ల లాకుసుండి గంగ్రేదు సినిమా ఆలు దాకా అరగంటలో వొచ్చి పడతాడండి..."

ఇతనిలా చెపుతూండగానే బస్సు వచ్చేస్తుంది. మనం ఎక్కేస్తాం. బస్టాండులో అతను చెప్పినది మాత్రం మనసులో మెదులుతూ వుంటుంది. ఆ బస్సుడ్రైవరు, సీతాలచ్మి కలిసుండగా పెళ్లాం కంటబడితే ఏమవుతుంది? పోనీ సీతాలచ్మి, క్లీనరు వ్యవహారం డ్రైవరుకి తెలిస్తే? నరికేస్తాడా? క్షమించి వదిలేస్తాడా? ఏమో, ఈ బస్టాండు అతను చెప్పలేదు. చెప్పలేడు కూడా.

ఎందుకంటే అతను చెపుతున్నది జీవితం. మీ గురించి రెండు పేజీలు తిరిగేలోగా సడన్‌గా అది ఓ మలుపుకి వచ్చేయదు. అది అలా సాగుతూనే వుంటుంది. మలుపు తిరగవచ్చు, లేదా అలాగే సాగిపోతూనే వుండవచ్చు. పసలపూడికథలు కూడా నేనిప్పుడు చెప్పినట్టు ఉంటాయి. బోల్డన్ని డీటైల్స్ – అవసరం వున్నవీ, లేనివీ – కలుపుకుంటూ చెప్పుకుపోతుంది. వాటిల్లోంచి దేన్ని ఫోకస్ చేస్తున్నాడో – అంటే బస్సు టైముకి రావడమా, లేక డ్రైవర్ రంకు వ్యవహారమా, లేక క్లీనర్ కిల్లాడీతనమా అన్నది – మనకు మనమే తెల్చుకోవాలి. కథకుడు చెప్పడు. దేన్నీ ఫోకస్ చేస్తున్నట్టూ కనబడదు. కథ అనే సంస్కృత ధాతువు అర్థం చెప్పడం. అదే ఇక్కడ కనబడుతుంది. వంశీ చెప్తూ పోతాడు. కథానిక అనే నిర్వచనం ప్రకారం ఫలానా ఇంత లెంగ్త్ వుండాలి, అది అధిగమించకూడదు అని ఆపడు.

అమరావతి కథల్లో కనబడేది ఆర్తి. పసలపూడి కథల్లో కనబడేది జీవితాన్ని నిజాయితీగా అక్షరబద్ధం చేయాలనే తపన, నిబద్ధత. అందుకే ఇందులోని మనుషులు నలుపు, తెలుపు కలిసి వుంటారు. ఊరికి ఉపకారం చేసేవాళ్లలో కూడా ఆడవాళ్లని వుంచుకునే అలవాటుంటుంది. ఈ ఉంపుడుగత్తెలు కూడా మిగతా విషయాల్లో నీతిగా కనబడతారు. అమరావతి కథల్లో భావుకత ఎక్కువ. ఒక్కోటీ ఒక్కో ఖండకావ్యంలా తయారయింది. లెంగ్త్‌లో కూడా అవి చిన్నవి కాబట్టి వాటికా రూపం సమకూరింది. వంశీ స్వతహాగా భావుకుడు. ఆయన సినిమాల్లో ప్రకృతిని, మనుష్యుల ప్రకృతిని చక్కగా కవితాత్మకంగా ప్రెజెంట్ చేస్తాడు. కానీ పసలపూడి కథలు మాత్రం ఆయన కవిత్వంలా ప్రెజెంట్ చేయలేదు. అలా అని మెలోడ్రమటిక్‌గా చెప్పలేదు.



వంశీ ఓ సమర్థుడైన దర్శకుడు కాబట్టి పసలపూడికి ఓ కెమెరా పట్టుకెళ్లి అక్కడివాళ్ల జీవితాల్ని ఫోటోలు తీస్తూ పోయేడనిపిస్తుంది. ఈ డాక్యుమెంటరీలో మీకోసం డ్రమెటిక్ ట్విస్టులు రమ్మంటే రావు. పాత్రలు మిమ్మల్ని మెప్పిద్దామని

కనబడతారు. జమీందార్లనుండి జమేదార్లవరకూ అందర్నీ తన కెమెరాలో బంధించారు వంశీ. అవన్నీ మనకు ఎంత విశదంగా, విపులంగా అందించారంటే పసలపూడి మ్యాప్, ఆ వూళ్లోవాళ్ల వంశవృక్షాలూ మనకు కంఠతా వచ్చేటంత!

ఆ ఆథెంటిసిటీ ఎంత యిదిగా వుందంటే బిస్మిల్లాఖాన్ గారు 'కుమ్మరి కోటయ్య' కథ చదివేకనే వారణాశి గురించి అంత ఎమోషనల్‌గా చెప్పారేమో అని మనకు అనుమానం కలిగేటంత! కుమ్మరి కోటయ్య  ఓ డోలు వాద్యగాడు. ఓ సారి ఓ మంత్రిగారు వచ్చి 'చాలా బాగా వాయిస్తున్నావు. ఆస్థాన విద్వాంసుడు పోస్టు యిప్పిస్తాను, హైదరాబాదు వచ్చేయి' అంటాడు. 'తప్పకుండా వస్తాను కానీ నాతోపాటు మా పసలపూడి లాకులూ, నీడనిచ్చే చెట్లూ, మా గోదారి కాలవా, వెంపర్తమ్మ గుడీ..యివన్నీ కూడా హైదరాబాదు తరలిస్తే తప్ప నేను రాలేనండి.. అవి లేకపోతే నేను లేనే లేనండి' అంటాడు కుమ్మరి కోటయ్య.

బిస్మిల్లాఖాన్ గార్ని అమెరికా రమ్మంటే ఆయనా ఇలాటి సమాధానమే చెప్పాడు - గంగానదికి అక్కడికి తీసుకొస్తారా అని. పెద్దాయన కాబట్టి ఆయన వ్యాఖ్య పేపర్ల కెక్కింది. అక్కడక్కడైనా కుమ్మరి కోటయ్యల్లాటి వాళ్లు వుంటారు. వాళ్లలో ఒకణ్ని వంశీగారు కథల కెక్కించారు. కుమ్మరి కోటయ్య కథ లాటిదాన్ని దీన్నే హిస్టారికల్ ఫిక్షన్ అనవచ్చేమో! వేరేచోట జరిగినది పట్టుకొచ్చి ఇక్కడ ట్రాన్స్‌ప్లాంట్ చేయడం. ఇదేమీ తప్పుకాదు కానీ వంశీ ప్రతిభ వల్ల ఇదే ఒరిజినల్ కింద, అది డూప్లికేట్ కింద భాసించే ప్రమాదం వుంది.

గమ్యం కంటె గమనం ముఖ్యం అంటారు. ఓ హిల్ స్టేషన్‌కి వెళుతున్నామనుకోండి. వెళ్లేదారిలో ఆ చెట్లూ, కొండలూ చూసి మురిసిపోతాం. తీరా కొండపైకి వెళ్లి హోటల్లో వుంటే అంత మజా రాదు. టిఫెను బాగా లేదనీ, దుప్పట్లు వాసన వేస్తున్నాయనీ ఈ సణుగుళ్లతోనే సరిపోతుంది. అలాగే ఈ పసలపూడి కథల్లో కథపై కంటే కథనం పైననే ఎక్కువ దృష్టి పెట్టి మెప్పించారు వంశీ. ఇందాకా నేను ఎగ్జాంపుల్‌లో చెప్పినట్టు ఆ బస్‌స్టాండులో వాడు అలా అలా అల్లుకుపోతూవుంటే భలే సరదాగా వుంటుంది. పీచుమిఠాయి తింటున్నట్టు భలే వుంటుంది. అంతా అయిపోయాక ఇంతకీ ఏం తేల్చాడురా? అసలు సంగతి చెప్పకుండా భలేగా మాటల్లో పెట్టేశాడే! అనిపిస్తుంది.

ఇవి కథా చిత్రాలు. ఇందాకా చెప్పినట్టు వంశీ తీసిన ఫోటోలు. గీసిన బొమ్మలు. ఒక్కో బొమ్మ గీయడానికి ఆయన తన కిష్టం వచ్చినంత సేపు తీసుకున్నాడు. కొన్ని వాటిల్లో బోల్డు గీతలు గీసి, గీసి చూసుకుంటూ వుంటే మన కనుమానం వేస్తుంది - ఈ గీతల్లోంచి ఏ బొమ్మ తయారవుతుందాని. ఆ ముందుగా గీసుకున్న గీతలను ఆయన చెరిపేయలేదు. కాలవ గురించి, పక్కన చేపలు పట్టుకునే వాడి గురించి చెప్పి, చెప్పి చివరికి కాలువ గట్టు మీదున్న మేడలో గొప్పింటి ఆడపడుచు గురించి చెప్పి ముగిస్తాడు.



'దారుణం కదా' అనే కథ ఓ అనుమానం మొగుడి గురించిన కథ. ఓ తుపాను వేళ భర్త ఎలా వున్నాడో అని ఆరాటపడి పక్కింటి కుర్రాడి సాయం తీసుకుని వచ్చిన భార్యను చూసి భర్త ఓదార్పుగా ఏమీ అనకపోగా 'ఈ కుర్రాడితో వచ్చిందేమిటి?' అనుకుంటాడు. ఈ కథ ప్రారంభమయ్యేది ఆ అమ్మాయి గూండా మేనమామ దగ్గిర. అతను మళ్లీ కథాంతంలో దర్శనం యివ్వడు. కథ మొదట్లో గోడ మీద తుపాకీ వుందని చెపితే కథ ముగిసేలోగా అది పేలి తీరాలనే